# మహానది

MAHANADI TELUGU DAILY

Website: www.mahanadi.net

PRGI No. TEL TEL: 2012/48343

రంగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 105 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | శనివారం | జూలై | 25 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00


## నీట్ కుట్రల వెనుక విదేశీ శక్తులు: బండి



హైదరాబాద్,జూలై, 24:ఢిల్లీలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయి లో ధ్వజమెత్తారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన... విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని స్పష్టం చేశారు. నీట్ ఆందోళనల ముసుగులో దేశంలో అరాచకాలు సృష్టించేందుకు కొన్ని కుట్ర శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఎండగట్టారు. నీట్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల కలలు, తల్లిదండ్రుల ఆశలతో ముడిపడి ఉన్న అంశమని, ఈ ఘటనపై ప్రధాని మోదీ తీవ్రంగా కలత చెందారని బండి సంజయ్ తెలిపారు.

### నీట్‌పై ప్రధాని వీడియో
## దయనీయం

- నీట్ వివాదంపై ప్రధాని మోదీ వీడియోను తీవ్రంగా విమర్శించిన రాహుల్
- విద్యార్థుల మేధస్సును ప్రధాని అవమానిస్తున్నారని ఆరోపణ
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్



న్యూఢిల్లీ,జూలై24,

నీట్ పరీక్షల పేపర్ లీకేజీ వివాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేసిన వీడియోపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అర్ధరాత్రి విడుదల చేసిన ఈ వీడియో విద్యార్థుల మేధస్సును అవమానపరిచేలా ఉందని ఆయన విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన మరోసారి డిమాండ్ చేశారు.ఈ మేరకు శుక్రవారం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా రాహుల్ గాంధీ స్పందించారు. "ప్రధాని విడుదల చేసిన అర్ధరాత్రి వీడియో అత్యంత దయనీయంగా ఉంది. ఇది విద్యార్థులను అవమానించడమే" అని ఆయన పేర్కొన్నారు. నీట్ వివాదానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని, నిరసన తెలుపుతున్న విద్యార్థులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల పరిధిలోనే
# ఉండేలా చూడాలి

- ఉద్యోగ, ఉపాధికి దగ్గరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ

- నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలి

- ఔటర్ రింగ్ రోడ్(ఓఆర్ఆర్) లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలి



హైదరాబాద్,జూలై24,

: క్యూర్ జోన్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వివిధ శాఖలకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. కోర్ అర్బన్ ఏరియాలో ఇందిరమ్మ ఇండ్లపై ముఖ్యమంత్రి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నంప్రభాకర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు నియోజకవర్గాల్లో ఇప్పటికే గుర్తించిన స్థలాల గురించి అధికారులు సీఎంకు వివరించారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించి గుర్తించిన నిరుపయోగ స్థలాలను తీసుకుని, ప్రత్యామ్నాయంగా సంబంధిత శాఖలకు వేరేచోట స్థలాన్ని కేటాయించాలని ఆదేశించారు.జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తే.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటుఅవి నిరుపయోగంగా మారే అవకాశం ఉందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేలా చూడాలని చెప్పారు. దీనివల్ల నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు.క్యూర్‌ఏరియా లో పలునియోజకవర్గాల్లోనిరుపేదలకు ఇందిరమ్మఇండ్లు నిర్మించి ఇస్తామని రాష్ట్రం ప్రభుత్వం ప్రకటన చేసింది. ఒక్కో ఫ్లాట్ దాదాపు 528చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించనుంది. ఇంటి నిర్మాణానికి దాదాపు రూ. 11 లక్షలు ఖర్చవుతుండగా, ప్రభుత్వం ఇందులో రూ. 5 లక్షల మేరకు సబ్సిడీని అందిస్తోంది.



### విద్యార్థుల భవిష్యత్తుకే
# తొలి ప్రాధాన్యం

- పేపర్ లీక్‌లపై కఠిన చట్టానికి సిద్ధమైన కేంద్రం
- నేటి క్యాబినెట్ భేటీలో బిల్లుపై నిర్ణయం
- వేగవంత విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు ఆదేశం

న్యూఢిల్లీ,జూలై24,

దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన పోటీ పరీక్షల పేపర్ లీకేజీ వ్యవహారాలపై కేంద్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధమైంది. ఈ అక్రమాలకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు ఉద్దేశించిన నూతన బిల్లుపై శుక్రవారం జరిగే కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఆమోదం పొందిన వెంటనే ఈ బిల్లును అతి త్వరలోనే పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టంగా మారుస్తామని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, నిరుద్యోగుల నుంచి వెల్లువెత్తుతున్న ఆందోళనల నేపథ్యంలో ప్రధాని గురువారం అర్ధరాత్రి దాటాక ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కేవలం 12 గంటల వ్యవధిలోనే ఈ సున్నితమైన అంశంపై ఆయన రెండుసార్లు ప్రకటనలు చేయడం గమనార్హం. పేపర్ లీకేజీలు అనేవి సాధారణమైన పొరపాట్లు కావని, అవి లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని, వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని తీవ్రంగా దెబ్బతీసే ద్రోహమని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేరాలకు పాల్పడిన ప్రధాన నిందితులను ఇప్పటికే అరెస్టు చేసి జైలుకు పంపించామని, విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు వివరించారు.

### ఢిల్లీలో జరిగిన నీట్ ఆందోళనల్లో కేసీఆర్
# ఎందుకు లేరు?

- బీజేపీతో బీఆర్ఎస్ పార్టీకి లోపాయకారీ ఒప్పందం ఉందన్న మహేశ్ గౌడ్
- వారి ఎంపీ స్థానాలను బీజేపీకి దానం చేశారని ఆరోపణ
- రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగులను వాడుకున్నారని విమర్శ

హైదరాబాద్,జూలై24,

ఢిల్లీలో జరిగిన విద్యార్థుల ఆందోళన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎందుకు పాల్గొనలేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీజేపీతో ఉన్న లోపాయకారీ ఒప్పందం కారణంగానే బీఆర్ఎస్ నేతలు ఢిల్లీకి వెళ్లి నిరసన తెలపలేకపోయారని ఆయన విమర్శించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు తెచ్చుకుని, వారి ఎంపీ స్థానాలను బీజేపీకి దానం చేశారని ఆరోపించారు. దేశంలో పలు ప్రాంతీయ పార్టీల వలే బీఆర్ఎస్ కూడా బీజేపీ గుప్పిట్లోనే ఉందనేది పచ్చి నిజమని, అందుకే గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రతిపాదించిన బిల్లులన్నింటికీ బీఆర్ఎస్ మద్దతుగా నిలిచిందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఢిల్లీకి వెళ్లకపోయినా, నీట్ ఉద్యమానికి పూర్తిస్థాయిలో మద్దతుగా నిలిచారని అన్నారు.





### పసిడి ప్రియులకు స్వల్ప
# ఊరట

హైదరాబాద్,జూలై24,

బంగారం ధరలు శుక్రవారం స్వల్పంగా తగ్గాయి. గత రెండు రోజులతో పోలిస్తే పసిడి, వెండి ధరలు స్వల్పంగా క్షీణించడం కొనుగోలుదారులకు కొంత ఊరటనిచ్చే పరిణామం. దేశీయ మార్కెట్లో నేటి ఉదయం నమోదైన గణాంకాల ప్రకారం, తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ధరలు స్థిరంగా కొనసాగు తున్నాయి.హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,170గా నమోదైంది.

### తెలంగాణ ఆర్టీసీ
# ఉద్యోగులకు గుడ్‌న్యూస్

- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియకు వేగంగా అడుగులు
- ఆగస్టు మూడో వారంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించే అవకాశం
- డిసెంబరు 9న విలీనంపై తుది ప్రకటన చేసేందుకు ప్రభుత్వ కసరత్తు
- విలీన విధివిధానాల్లో ఎన్నికల్లో గెలిచిన సంఘానికి భాగస్వామ్యం
- ఏప్రిల్ సమ్మె హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వ చర్యలు

హైదరాబాద్,జూలై24,

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న చిరకాల వాంఛను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కసరత్తు చేస్తోంది. ప్రణాళిక ప్రకారం అన్నీ జరిగితే, తెలంగాణ ఆవిర్భావ ప్రకటన వెలువడిన డిసెంబరు 9వ తేదీన విలీనంపై తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈలోగా విలీన ప్రక్రియకు సంబంధించిన పూర్తి విధివిధానాలను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.విలీన ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ముందుగా ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను నోడల్ అధికారిగా నియమించింది. ఆగస్టు మూడో వారంలో ఈ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఎన్నికల్లో గెలిచిన సంఘాన్ని విలీన విధివిధానాల రూపకల్పనలో భాగస్వామ్యం చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే స్పష్టం చేశారు.




### అనుమతి లేకుండా వీడియోలను
# అప్‌లోడ్ చేయడంపై నిషేధం

**కోర్టు విచారణలను విచ్చలవిడిగా, అసంపూర్తిగా ప్రసారం చేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం**

న్యూఢిల్లీ,జూలై24,

కోర్టు విచారణలకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌లను సోషల్ మీడియాలో విచ్చలవిడిగా, అసంపూర్తిగా ప్రసారం చేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్ర ఒగా పరిగణించింది. కోర్టు కార్యకలాపాల వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడాన్ని సీసాలో నుంచి బయటకు వచ్చిన భూతంతో పోల్చిన ధర్మాసనం, సంబంధిత కోర్టుల ముందస్తు అనుమతి లేకుండా వాటిని పోస్ట్ చేయడం, ఎడిట్ చేయడం లేదా రీ-పోస్ట్ చేయడంపై మధ్యంతర స్టే విధిస్తూ సంచలన ఆదేశాలు జారీ చేసింది.



### భారతదేశ క్వాంటమ్ భవిష్యత్తుకు
# అమరావతి ముఖద్వారం

- క్వాంటం టెక్నాలజీలో ఏపీని గ్లోబల్ హబ్‌గా మార్చే లక్ష్యం
- ప్రముఖ క్వాంటం కంపెనీ 'క్వాంటినమ్' సీఈవోతో నిన్న సీఎం చంద్రబాబు భేటీ




అమరావతి,జూలై24

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్వాంటం టెక్నాలజీ రంగంలో దేశానికి ముఖద్వారంగా (గేట్‌వే) తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ దిశగా మరో కీలక అడుగు పడింది. ప్రపంచంలోని ప్రముఖ క్వాంటం కంప్యూటింగ్ సంస్థ 'క్వాంటినమ్' సీఈవో డాక్టర్ రాజీబ్ హజ్రాతో, ఆయన బృందంతో సీఎం చంద్రబాబు నిన్న సమావేశమవడం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌తో భాగస్వామ్యం ద్వారా దేశ క్వాంటం ఆశయాలను బలోపేతం చేయడంపై ఈ భేటీలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు సోషల్ మీడియా వేదికగా కీలక వివరాలను పంచుకున్నారు. క్వాంటం టెక్నాలజీకి సంబంధించి ప్రపంచస్థాయి పోటీని తట్టుకునేలా ఏపీలో ఒక సమగ్ర వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## పాలకుల వివక్ష పై పోరుకు

# పాత్రికేయులు సిద్ధం కావాలి

**- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య - ఘనంగా కూకట్ పల్లి మహాసభ**




**హైదరాబాద్, మహానది న్యూస్, జూలై 24:** తెలంగాణ ఉద్యమంలో త్యాగాలకు సిద్దపడి పోరాడిన జర్నలిస్టులు పాలకుల వివక్షకు,నిర్లక్ష్యానికి గురవుతున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు కనీసం అక్రెడిటేషన్లు సక్రమంగా ఇవ్వలేని దుస్థితి నెలకొందని, దీనిపై రోడ్లెక్కి ఆందోళన చేయాల్సిన దౌర్భాగ్యమైన పరిస్థితి రావడం బాధాకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం కూకట్ పల్లిలోని ఏఎస్ రాజు నగర్ కమ్యూనిటీ హాల్ లో టీడబ్ల్యూజేఎఫ్ కూకట్ పల్లి నియోజకవర్గం మహాసభ ఘనంగా జరిగింది. ఈ మహాసభలో మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ, రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై టీడబ్ల్యూజేఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని అన్నారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సహించరానిదని, పాలకుల నిర్లక్ష్యం, వివక్షపై రాబోయే రోజుల్లో పాత్రికేయుల పోరాటం తీవ్రతరం చేయాల్సి వస్తుందని అన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కూడా జర్నలిస్టులను చిన్న చూపు చూస్తున్నదని, జర్నలిస్టులకున్న ఏకైక సదుపాయం అయిన రైల్వే చార్జీలో 50 శాతం రాయితీని ఎత్తివేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యలపై ఈనెల 27న "ఛలో పార్లమెంట్" కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ ను మరింత బలోపేతం చేసి, రాబోయే రోజుల్లో సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ ఏ రాజకీయ పార్టీకి గానీ, ఏ ఒక్క పత్రికకు గానీ అనుబంధం కాదని, ఈ అపోహలతో జర్నలిస్టులు అయోమయంలో పడొద్దని అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు కట్టెల మల్లేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్



సభ్యుడు జగదీశ్వర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాగరాజు గౌడ్, సీనియర్ జర్నలిస్టులు విద్యా వెంకట్, ఎర్ర యాకయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది అశోక్, ఉపాధ్యక్షులు కొండల్ రెడ్డి, కావలి మోహన్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**కూకట్ పల్లి కమిటీ ఎన్నిక - అధ్యక్షుడుగా ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శి గా అంజిబాబు**



ఈ మహాసభ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ కూకట్ పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నూతన కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్ర యాకయ్య, ఉపాధ్యక్షుడిగా బొమ్మ గోపి,ప్రధాన కార్యదర్శిగా అంజిబాబు,సంయుక్త కార్యదర్శి గా నాగార్జున,కోశాధికారి గా షబ్బీర్, కార్యవర్గ సభ్యులుగా నాగరాజు గౌడ్,సైదులు, శ్యాం సుందర్,జే. నవీన్, సుజాత, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మహేందర్ తదితరులు ఎన్నికయ్యారు.

## ఉత్తమ కామర్స్ అధ్యాపకులుగా

# బద్రుక అధ్యాపకులు





**హైదరాబాద్, మహానది న్యూస్,జూలై 24:** హైదరాబాద్ లోని ప్రముఖకామర్స్ కాలేజీ అయిన బద్రుక కళాశాల కు చెందిన అధ్యాపకులకు ఉన్నత విద్యా రంగంలో విశిష్ట సేవలు, నాణ్యమైన బోధన, పరిశోధనలో వారు చేసినటువంటి కృషికి గుర్తింపుగా డా. శ్రీరామ్ ధైద మరియు డాక్టర్ కట్ట మీది నవీన్ కుమార్ లకు ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రాక్టికల్ అకౌంటెన్సీ (ఐపీఏ) ప్రతిష్ఠాత్మక 'ఉత్తమ కామర్స్ అధ్యాపకుల పురస్కారం' ప్రకటిం చింది.డా. శ్రీరామ్ ధైదకు కు 2025 సంవత్సరానికి, డాక్టర్ కట్ట మీది నవీన్ కుమార్ కు 2026 సంవత్సరానికి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలు దక్కాయి. ఇద్దరూ రెండుదశాబ్దాలకు పైగా కామర్స్ విద్యా రంగంలో సేవలందిస్తూ విద్యార్థుల ప్రతిభ వికాసం, నాణ్యమైన బోధన, పరిశోధన, పాఠ్య ప్రణాళికల రూపకల్పన, అధ్యాపక శిక్షణ కార్యక్రమాలు, విద్యార్థులకు మార్గదర్శకత్వం వంటి అంశాల్లో విశేష సేవలు అందిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు, పరిశోధన ప్రాజెక్టుల్లో చురుకుగా పాల్గొంటూ ఉన్నత విద్యా ప్రమాణాల పెంపునకు విశేష కృషి చేసినందుకు ఈ పురస్కారాలు లభించినట్లు ఐపీఏ పేర్కొంది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరామ్ ధైద మరియు డాక్టర్ కట్టమీది నవీన్ కుమార్ తమకు సహకరించిన యాజమాన్యం, సెక్రటరీ శ్రీ శ్రీకిషన్ బద్రుక, డైరెక్టర్ జనరల్ ప్రొ. అభిరామ కృష్ణ,కళాశాల ప్రిన్సిపల్ డా.బి. మోహన్ కుమార్ , సహచర అధ్యాపకులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవాన్ని ఉపాధ్యాయ వృత్తికి అంకితం చేస్తూ, భవిష్యత్తులో కూడా విద్యా సేవలను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యా రంగ ప్రముఖులు, అధ్యాపకులు, సహచరులు ఇద్దరు అధ్యాపకులను అభినందిస్తూ, ఈ పురస్కారాలు కామర్స్ విద్యా రంగంలో వారి సేవలకు దక్కిన సముచిత గుర్తింపుగా పేర్కొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై 27న "ఛలో పార్లమెంట్"

**- ఖమ్మంలో పోస్టర్ ఆవిష్కరించిన టీడబ్ల్యూజేఎఫ్ - విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్ పిలుపు**




**ఖమ్మం,మహానది న్యూస్,జూలై 24:** కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యల పై ఈ నెల 27వ తేదీన "ఛలో పార్లమెంట్" కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా నాయకులు వెల్లడించారు. శుక్రవారం ఖమ్మంలోని ప్రెస్ క్లబ్‌లో ఛలో పార్లమెంట్ కార్యక్రమానికి సంబందించిన వాల్ పోస్టర్ ను ఫెడరేషన్ అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్, జిల్లా సభ్యులు ఆవిష్కరించారు.

# ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలోని ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్ లో ఫుడ్ పాయిజన్ కారణంగా విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం రాత్రి భోజనం అనంతరం సుమారు 11 గంటల సమయం నుంచి 29 మంది విద్యార్థులు వాంతులు విరోచనాలు బాధపడ్డారు..విద్యార్థులను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాల్సిన పాఠశాల యాజమాన్యం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పాఠశాలలోనే విద్యార్థులకు ఫ్లూయిడ్స్ ఎక్కిస్తూ కాలయాపన చేశారు. గురువారం ఉదయం పట్వారిగూడెం ఆసుపత్రి వైద్యా సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులకు చికిత్స అందించగా 26మంది విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడగ..మిగిలిన మరో ముగ్గురు విద్యార్థులు మాత్రం గురువారం రాత్రి వరకు వాంతులు విరోచనాలు కొనసాగుతున్నాయి.వీరికి పాఠశాలలోని నర్సు సాయంతో చికిత్స అందిస్తున్నారు. గురువారం రాత్రి వరకు విద్యార్థులు అస్వస్థకు గురైన విషయాన్ని అటు పాఠశాల యాజమాన్యం గాని ప్రభుత్వ వైద్యులు కానీ బయటికి చెప్పకపోవడం విశేషం. నెమ్మదిగా విషయం దమ్మపేట మండల తహసిల్దార్ రామ్ నరేష్ కు చేరడంతో ఆయన హుటాహుటిన పాఠశాలకు చేరుకొని విద్యార్థులను పరిశీలించారు . అప్పటికే ముగ్గురు విద్యార్థులు పూర్తిగా నిరసించి కనిపించడంతో చలించిన తహసిల్దార్ పాఠశాల యాజమాన్యం పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు..విద్యార్థులు నీరసంతో ఉన్నప్పటికీ అక్కడే ఉండి విద్యార్థులను పర్యవేక్షించాల్సిన డాక్టర్ సైతం అందుబాటులో లేకపోవడం పట్ల మరింత ఆగ్రహానికి గురయ్యారు వెంటనే ప్రభుత్వ డాక్టర్ కు ఫోన్ చేసి వెంటనే పాఠశాలకు రావాలని ఆదేశించారు.108 అంబులెన్స్ వాహనాన్ని సైతం రప్పించి ఇద్దరు విద్యార్థులకు మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. స్థానిక ఎమ్మెల్యే స్వగ్రామంలో ఎమ్మెల్యే నివాసానికి 1000 మీటర్ల దూరంలోనే ఉన్న ఈ పాఠశాలల లో ఇలాంటి సంఘటన చోటు చేసుకున్నప్పటికీ కనీసం ఎమ్మెల్యేకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

అధికారుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదినారాయణ పాఠశాలకు చేరుకొని పాఠశాల యాజమాన్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ఇతర రాష్ట్రాల బోధన సిబ్బంది ఉండటంతోఅటు గిరిజన విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇక్కడ అధ్యాపకు బృందంలో విద్యార్థులను పట్టించుకునే వారే లేరని తాను పాఠశాలలను సందర్శించిన సమయంలో కూడా ఇన్చార్జిలుగా ఎవరు విధులు నిర్వర్తించడం లేదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను అందుబాటులో ఉన్నప్పటికీ ఇలాంటి సంఘటన జరిగిన సమయంలో కూడా తనకు కనీస సమాచారం ఇవ్వకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ఆదినారాయణ, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి అనారోగ్యానికి కారణమైన వారిపై తప్పక చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## వరంగల్, ఖమ్మం, కరీంనగర్ కార్పొరేషన్లకు..

# ఔటర్ రింగ్ రోడ్డు

హైదరాబాద్, : తెలంగాణలో కొత్తగా మరికొన్ని నగరాలకు ఔటర్ రింగ్ రోడ్డులు రాబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు ఇతర ప్రాంతాలకు సంబంధించి మెగా గ్రోత్ కారిడార్‌ల్లో ఏకరీతి అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ కార్పొరేషన్లకు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంపై మున్సిపల్‌శాఖకు సూచి ంచారు. రాష్ట్రంలో మెగా గ్రోత్ కారిడార్ల అభివృద్ధి, వాటి ప్రణాళికలపై ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగా ణలోని ప్రతిపాదిత మెగా గ్రోత్ కారిడార్ల అభివృద్ధి ప్రణాళికలపై అధికారులకు పలు సూచనలు చేశారు.'మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్లను కలుపుతూ గ్రోత్ కారిడార్ ఏర్పాటు ప్రణాళికలు రూపొం దించాలి. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ కలిపి గ్రోత్ కారిడార్ ఏర్పాటు చేయాలి. నల్గొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడా ర్‌ను, ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్ ఏర్పాటు కావాలి. కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని అలంపూర్ జోగులాంబ ఆలయ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి. సింగరేణి పరిధిలో ఉన్న అన్ని మున్సిపాలిటీలను ఒక యూనిట్‌గా అభివృద్ధి చేయాలి. సింగరేణి సంస్థ సీఎస్‌ఆర్ నిధులను స్థానికంగానే ఖర్చు చేయాలి. ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు, రింగ్ రోడ్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలతో పాటు ఇతర అంశాలన్నీ గ్రోత్ కారిడార్లలో స్పష్టంగా ఉండాలి' అని రేవంత్ రెడ్డి సూచించారు.

## జనసేన మెంబర్ షిప్ డ్రైవ్..

కాకినాడ,: జనసేన జనం కోసమే పార్టీ అన్నది పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నినాదం. పార్టీ పెట్టి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు పవన్. ఎంత కూటమిలో ఉన్నప్పటికీ పార్టీని బలోపేతం చేసుకోవాల్సి ఉందన్న సత్యాన్ని గుర్తించిన పవన్..

ఆదిశగా శరవేగంగా అడుగులేస్తున్నారు. సంస్థాగతంగా పార్టీని పటిష్ఠం చేయడమే లక్ష్యంగా, 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్' అనే శక్తిమంతమైన నినాదంతో మూడో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదుకు జనసేనాని శ్రీకారం చుట్టారు.కేవలం ఆంధ్రప్రదేశ్ కే పరిమితం కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పాటు మహారాష్ట్ర లోనూ తన ఉనికిని చాటుకోవాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# మినరల్ కాదు.. జనరల్ మాత్రమే

ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్‌తో పాటు కాగజ్ నగర్ రెండు నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. "ప్యూరి పై వాటర్" వంటి పేర్లతో సాధారణ నీటిని మినరల్ వాటర్ అని ప్రజలకు సరఫరా చేసి మోసం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాంట్లను నిర్వహించినా, సంబంధిత అధికారులు దీనిపై పట్టించుకోవట్లేదు. జిల్లాలో దాదాపు 80కి పైగా మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నప్పటికీ, వాటిలో కొన్నింటికి మాత్రమే ఎస్ఎస్ఐ, ఐఎస్ఐ రిజిస్ట్రేషన్లు ఉన్నాయి. మిగతా ప్లాంట్లు రోజు వేల లీటర్ల నీటిని విక్రయించి లక్షల్లో ఆదాయం పొందుతున్నారు. ఈ నీటిని తాగిన వారికి అనేక ఆరోగ్య సమస్యలు రావడం సాధారణం అయింది.

మినరల్ మాటున దందా...: మినరల్ వాటర్ పేరుతో వాటర్ ప్లాంట్ యాజమాన్యాలు నీటిని శుద్ధి చేయకుండానే క్యాన్లలో నింపి లాభం పొందుతున్నారు. నీటిని నిల్వ చేసే ట్యాంక్‌లను నెలల తరబడి శుభ్రం చేయకపోవడం, నాణ్యతకు హానికరంగా మారింది. నీటిని శుద్ధి చేసిన తర్వాత నిబంధనల ప్రకారం క్యాన్ల పై తేదీ వివరాలను స్టిక్కర్ చేయాలి. కానీ ప్లాంట్ యాజమాన్యాలు ఈ నియమాన్ని పాటించడం లేదు. కనీసం ప్లాంట్ వద్ద అర్హత గల ల్యాబ్ టెక్నీషియన్ ఉండి, రోజూ నీటిని పరీక్షించి కాలుష్యం, మెగ్నీషియం మోతాదులు పరీక్షించిన తర్వాత మాత్రమే నీటిని సరఫరా చేయాలి.

# భారీగా సోలార్ ఉత్పత్తికి సింగరేణి ప్రణాళికలు

అదిలాబాద్, : పర్యావరణహిత గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా సింగరేణి సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. కార్మికుల నివాస గృహాలపై రూఫ్ టాప్ సౌర ఫలకాలను ఏర్పాటు చేయాలని డిసైడ్ అయింది. ఈ మేరకు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. సుమారు రూ. 65 కోట్ల వ్యయంతో 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సంస్థపై ప్రతి నెలా పడుతున్న రూ. 50-60 కోట్ల విద్యుత్ బిల్లుల భారం కొంత మేర తగ్గనుంది.సింగరేణి సంస్థ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా సింగరేణి ఏరియాల్లోని కార్మికుల నివాస గృహాలపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం అనువైన నివాస గృహాలను గుర్తించేందుకు ఆరు నెలల క్రితమే సింగరేణి అధికారులు సర్వే నిర్వహించారు. ఎక్కడైతే చెట్లు, నీళ్ల ట్యాంకులు లేకుండా ఖాళీగా నివాస గృహాలు ఉన్నాయో.. వాటిపై ఈ ప్యానళ్లు ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా సింగరేణి యాజమాన్యం గతేడాది డిసెంబర్‌లో ఓ సంస్థతో అగ్రిమెంట్ సైతం కుదుర్చుకుంది. పదేళ్లపాటు ఈ సంస్థనే కార్మికుల ఇళ్లపై సోలార్ నిర్వహణ బాధ్యత చేపట్టనుంది.సింగరేణి క్వార్టర్లలో కార్మికుల గృహ విద్యుత్తు వినియోగానికి ప్రస్తుతం నెలకు సుమారుగా రూ.50 నుంచి 60 కోట్ల మేర చెల్లిస్తోంది. రూఫ్ టాప్ సౌర విద్యుత్తుతో సింగరేణికి ఆ



భారం చాలా వరకు తగ్గనుంది. అన్ని ఏరియాల వ్యాప్తంగా 15 వేల కిలోవాట్ల మేర సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలని సంస్థ టార్గెట్‌గా పెట్టుకుంది. ఇందు కోసం రూ.65 కోట్ల ఖర్చు చేయనుంది. ఉద్యోగుల గృహాలకు వినియోగించగా మిగిలిన మొత్తాన్ని గ్రిడ్‌కి అనుసంధానించనున్నారు. ఈ మేరకు 800 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తే లక్ష్యంగా ఇప్పటికే పలు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ ప్లా?ంట్ల ద్వారా ప్రస్తుతానికి 500 మెగావాట్ల వరకు లక్ష్యాన్ని సాధించింది. రూఫ్‌టాప్ సౌర విద్యుత్తు పనులు త్వరలో ప్రారంభం అవుతాయని మణుగూరు వర్క్‌షాపు డీజీఎం శ్రీకాంత్ తెలిపారు. సౌర ఫలకలు ఏర్పాటు చేసేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని అన్నారు.కాగా, సింగరేణి సంస్థ చేపట్టిన ఈ రూఫ్ టాప్ సౌర విద్యుత్ ప్రాజెక్టు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

# హెచ్ బీ కాలనీలో ఎల్ఐజీ, ఎంఐజీలు

హైదరాబాద్, : పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేసే దిశగా తెలంగాణ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. హైదరాబాద్ శివారులో ఎల్ఐజీ, ఎంఐజీ( వర్గాలకు తక్కువ ధరలకే ఇళ్లను కట్టించి ఇవ్వడానికి ప్రణాళికలు రచిస్తోంది. అందుకు కావాల్సిన స్థలాలపై తాజాగా హౌసింగ్ బోర్డు దృష్టిసారించింది. ఈనెల 25 నుంచి ఏప్రిల్ 4 వరకు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) పరిధిలోని హౌసింగ్ బోర్డు, దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్స్ స్థలాలను గుర్తించి వాటికి రక్షణ గోడలను నిర్మించాలని డిసైడ్ అయింది.

ఈ 11 రోజుల్లోనే ఆయా పేద, మధ్యతరగతి ప్రజలకు స్థల సేకరణ, ఇళ్ల నిర్మాణంపై డీపీఆర్ తయారీకి ప్రణాళిక రూపొందించనుంది. హౌసింగ్ బోర్డుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 5 నుంచి 14 వరకు కేటాయింపుదారులతో కాలనీల వారీగా అధికారులు సమావేశాలను నిర్వహిస్తారు. ఏప్రిల్ 15 నుంచి 23 వరకు గ్రీవెన్స్ కాల్ సెల్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఎఫర్డబుల్ హౌసింగ్ పాలసీని సిద్ధం చేస్తోంది. ఈ నెలాఖరులోగా మార్గదర్శకాల ముసాయిదాను సర్కార్ రూపొందించనుంది. పాలసీ రూపకల్పనకు 'రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్' ద్వారా ఇప్పటికే సీబీఆర్ఐ కన్సల్టెన్సీ సంస్థను సైతం ఎంపిక చేసింది.తెలంగాణ రైజింగ్ విజన్-2047లో భాగంగా పట్టణ ప్రాంతాల్లో పీపీపీ పద్ధతిలో పేదలు, మధ్యతరగతి వారికి ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం మూడు దశల్లో ఈ ఇళ్ల సముదాయాలను నిర్మించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# సంపాదకీయం

## సమాజానికి చీడలా..డ్రగ్స్ మహమ్మారి

ఉడ్తా పంజాబ్... పేరుతో ఆనాడు గోలగోల జరిగింది. పంజాబ్ మాదక ద్రవ్యాలకు నిలయంగా మారింది. అక్కడ యువత పెడదారి పడుతోందని దేశవ్యాప్తంగా ఆందోళన వెల్లువెత్తింది. దీనిపై సినిమాలు వచ్చాయి. ఇప్పుడు దేశంలో ఎక్కడో ఒకచోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గంజాయి రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం ఆందోళన కలిగిస్తోంది.గంజాయి మత్తులో అనేకానేక హత్యాచారాలు జరిగాయి. ఇటీవల మదనపల్లెలో ఓ దుండగులు బాలికను హత్యాచారం చేసిన సంగతి చూశాం. మద్యం, మత్తు పదార్థాలు సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నా పాలకులు పట్టించు కోవడం లేదు. కఠిన చర్యలు తీసుకోవడం లేదు. దీంతో గంజాయి బ్యాచ్‌లు రెచ్చి పోతున్నాయి. నిత్యం కాపలా కాసి పట్టుకుంటున్నా గంజాయి రవాణా ఆగడం లేదు. రేవ్ పార్టీలు, ఫామ్ హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ విచ్చలవిడి వినియోగం మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రజాప్రతినిధులే డ్రగ్స్ స్వీకరిస్తే సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు. మొయినా బాద్ ఫామ్‌హౌజ్‌లో తెలంగాణ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేశ్‌లు పట్టుబడడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి వారిని రాజకీయాల నుంచి తరిమేయాలి. ఇలాంటి వారిని ప్రజాజీవితానికి దూరం చేయాలి. మొగ్గలోనే తుంచే యాలి. ఇలాంటి వారు మళ్లీ రాజకీయ జీవితంలోకి రాకుండా కఠిన ఆంక్షలు విధించాలి. ఇలాంటి వారి వల్లనే నేర సామ్రాజ్యం విస్తరిస్తుంది. డ్రగ్స్ ఎంతటి దారుణానికైనా తెగించేలా చేస్తుంది. హైదరాబాద్ నగర శివార్లలోని మొయినాబాద్ అజీజ్ నగర్ లో గల మాజీ ఎంఎల్ఎ పైలట్ రోహిత్ రెడ్డి ఫాం హౌస్ లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్, ఫోర్త్ సిటీ పోలీసులు గుట్టురట్టు చేయడం వెనుక భారీ ఆపరేషన్ కొనసాగింది. ఈ పార్టీలో ప్రముఖులు వున్నట్లు, ఇందులో డ్రగ్స్ వాడుతున్నట్లు సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు దీనిపై స్థానిక పోలీసుల సహకారంతో గత రాత్రి పది గంటల సమయంలో దాడులు చేయడం తెలిసిందే. ఈ సమయంలో అక్కడ ఒక మహిళతోపాటు 11 మంది వున్నారు. వీరంతా మద్యం మత్తులో వుండగా కొందరు డ్రగ్స్ సేవించినట్లు అనుమానాలు వుండడంతో అందరికి డ్రగ్స్ పరీక్షలు జరిపారు. ఇదే సమయంలో వాష్ రూం వద్ద చేతిలో ఎ32 కాలిబర్ రివాల్వరన్ను పట్టుకుని వుండగా అతన్ని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అతని పేరు నమిత్ శర్మగా తేలింది. ఇతని చేతిలో వున్న రివాల్వర్ జర్మనీలో తయారైనట్లు తేలింది. ఇతనికి సమీపంలో మరో వ్యక్తి ఖాళీ తూటా పట్టుకుని వుండగా అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇతన్ని సిల్వేరి శరత్‌కుమార్గా గుర్తించారు. ఇతని వద్ద 26 గ్రాముల కొకైన్, భారీగా మద్యం సీసాలు పట్టుబడ్డాయి. ఘటనా స్థలంలో తూటాతో పాటు మొత్తం 4 ఖాళీ తూటాలు లభ్యమయ్యాయి. రివాల్వర్ తోపాటు తూటాను, ఖాళీ తూటాలను పరీక్షల నిమిత్తం ఎఫ్ఎస్ఎల్‌కు పరీక్షల నిమి త్తం పంపారు. ఎక్కడో యూరప్, ఆఫ్రికా దేశాల్లో ఉన్న ఈ దురలవాటు మెల్లగా మనదేశంలోకి అడుగుపెట్టి ఆందోళనకు గురి చేస్తోంది. మెక్సికోలో డ్రగ్స్ మాఫియా డాన్ ఎలా నేర సామ్రాజ్యాన్ని స్థాపించాడో ఇటీవలే చూశాం. అతడిని ఎన్‌కౌంటర్ చేశరు. అలాగే ఇక్కడి నేరాలను కూడా ఆదిలోనే అదుపు చేయకపోతే సమాజానికి క్యాన్సర్‌లా పట్టిపీడిస్తుంది. 1980లో ఎల్మెంచో కాలిఫోర్నియాలో హెరాయిన్ సరఫరా చేస్తూ పోలీసులకు దొరికాడు. కొంతకాలం జైలుశిక్ష కూడా అను భవించాడు. తిరిగి మెక్సికోకి వచ్చాక కొన్నాళ్లు పోలీసుగా పనిచేశాడు. ఆపై అన్ని మెళకువలు తెలుసుకున్నాకదాన్ని వదిలిపెట్టి 2009లో తన డ్రగ్ మాఫియాకు ప్రాణం పోసాడు. అనూహ్యంగా ఆ ముఠా 2015లో 20 మంది పోలీసుల్ని తలలు నరికి చంపేసింది. అప్పట్నించిమెంచో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ జాబితాలోకి చేరి పోయాడు. ఎల్మెంచో వద్దనున్న ఆయుధ సంపత్తి అలాంటిలాంటిది కాదు. సాయుధ వాహనాలు, రాకెట్ లాంచర్లు, భారీ ఎత్తున ఆయుధాలను కూడా మెక్సికో సైన్యం స్వాధీన పరుచుకొంది. అతని ముఠాలో ఉన్న వాళ్లంతా కిరాయి హంతకులుగా పేరుపడిన వారే. తనకు ఎదురు తిరిగిన ప్రభుత్వాధి కారుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేవాడు. ఈ ముఠా మెక్సికో సైన్యానికి సవాల్‌గా మారింది. అతడి నేర సామ్రాజ్యాన్ని పెంచిపోషించిన వారెవరో అందరికీ తెలుసు. ఇది ప్రపంచానికి ఓ గుణపాఠం కావాలి. తెలంగాణ మాజీ న క్సలైట్ నయీమ్‌ను పెంచి పోషించిందెవరో అందరికీ తెలుసు. ఇలా నేరగాళ్లను ప్రోత్సహించడం వల్ల సమాజం ఛిద్రం కాగలదని గుర్తించాలి. అందుకే నేర స్వభావం ఉన్న వారికి ఏ రూపంలోనూ సకహరించ కూడదు. భారాస మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో పట్టుబడిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తో పాటు అతని స్నేహితుడు నమిత్‌శర్మల మత్తు చరిత్ర కొత్త అనుమానాలు రేకెత్తి స్తోంది. మత్తు మందులు వాడే అలవాటు వీరికి గతంలోనూ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. దిల్లీ వాసి నమిత్‌శర్మ, ఏలూరు ఎంపీ మహేశ్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో ఇతర మాదకద్రవ్యాల అవశేషాలు కూడా లభించడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. వాస్తవానికి తాజా కేసు దర్యాప్తుతో దీనికి సంబంధం లేకపోయినప్పటికీ మత్తు మందుల సరఫరా మూలాలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే పోలీసులు పాత విషయాలనూ తవ్వితీయబోతున్నారు. పార్టీలో తాము డ్రగ్స్ వాడలేదని నిందితులు తొలుత బుకాయించినప్పటికీ పోలీసుల పరీక్షల్లో మొత్తం 11 మందిలో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. ఇందులో నమిత్‌శర్మ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్, కొకైన్ ఆనవాళ్లు లభించాయి. పుట్టా మహేశ్ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్ ఆనవాళ్లు దొరికాయి. మిగతా నలుగురూ కొకైన్ వాడినట్లు తేలింది. పోలీసులు ప్రశ్నించినపుడు తాను సిమ్లా నుంచి కొకైన్ తీసుకొచ్చా నని బెంగళూరుకు చెందిన కౌషిక్ రవి వెల్లడించాడు. వారి సోదాల్లోనూ కొకైన్ మినహా ఇతరత్రా మత్తు మందులేవీ అక్కడ దొరకలేదు. కానీ, నమిత్‌శర్మ, పుట్టా మహేశ్‌ల నమూనాల్లో మాత్రం ఇతర మాదక ద్రవ్యాల ఆనవాళ్లు లభించాయి. వారిద్దరూ వీటిని జరిగిన పార్టీలో తీసుకున్నారా...? అంతకు ముందే వాడారా..? అనే వివరాలన్నీ తదుపరి దర్యాప్తులో వెల్లడవుతాయని పోలీసులు చెబుతున్నారు. వీటన్నింటినీ పరిశీలిస్తే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో చిక్కిన వారందరికీ కొంతకాలంగా మత్తుమందులు వాడే అలవాటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. పరీక్షలు చేసినపుడు ఆరుగురు డ్రగ్స్ వాడగా, అందులో ఐదుగురు కొకైన్ తీసుకున్నట్లు తేలింది. మొత్తంగా ఈ కేసుతో పాటు గతంలో పట్టుబడ్డ కేసులను కూడా విచారించాలి. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డవారు డ్రగ్స్ పార్టీలకు అలవాటు పడుతున్నారు. తెలంగాణ లో గతంలో సినీ రంగాన్ని కూడా మాదకద్రవ్యాల కేసు ఓ కుదుపు కుదిపింది. కానీ ఆ కేసు ఆచూకీ లేకుండా పోయింది. వీటిని ఇలాగే వదిలేస్తే రేపు సమాజానికి సవాల్‌గా మారుతుందని గుర్తించాలి.



# వాతావరణ సంక్షోభం వైపు భారత్

మన దేశం బహుళ వాతావరణ సంక్షోభం అంచులపై ఉంది. గణాంకాలు, అనుభవాలు, రోజువారీ జరుగుతున్న సంఘటనలు ఈ వాస్తవాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఈ సంక్షోభం ఒక్కసారిగా ఉద్భవిం చింది కాదు, సంవత్సరాలుగా కూడబెట్టుకున్న పర్యావరణ నిర్లక్ష్యం, అభివృద్ధి నమూనాల్లోని అసమతుల్యతల ఫలితమే అన్నది ఛేదు నిజం. భారత వాతావరణ విభాగం ప్రకారం 2025 సంవత్సరం దేశ చరిత్రలో ఎనిమిదవ అత్యంత వేడిమి సంవత్సరంగా నమోదైంది. సగటు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 0.28డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. ఈ సంఖ్య చిన్నదిగా కనిపించినా, వాతావరణ శాస్త్రంలో ఇది తీవ్రమైన మార్పులకు సంకేతం. ముఖ్యంగా 2016--2025 దశకం దేశ చరిత్రలోనే అత్యంత వేడి కాలంగా నిలవడం పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టంగా చూపుతోంది. 2026లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. మార్చి నెల నుంచే పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4డిగ్రీల నుంచి 8డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయి. వసంత కాలం క్రమంగా క్షీణించి, వేసవి ముందుగానే దాడి చేస్తోందన్న నిపుణుల అభిప్రాయం దీనికి బలం చేకూరుస్తోంది. 2025 సంత్సరంలో దాదాపు 330కి పైగా రోజుల్లో దేశవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట తీవ్రమైన వాతావరణ ఘటనలు నమోదయ్యాయి. తొలి తొమ్మిది నెలల్లో 99% రోజుల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం, ఈ పరిస్థితి ఎంత సాధారణంగా మారిందో తెలియజేస్తోంది. ఈ ఘటనల ఫలితంగా 4,000కు పైగా ప్రాణ నష్టం సంభవించగా, 94.7 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు నష్టపోవడం జరిగింది. లక్షకు పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. వాతావరణ మార్పు అనేది ఒకే ఒక్క విపత్తుగా కాకుండా, నిరంతర సంక్షోభంగా మారిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఉష్ణోగ్రతలలో తేడా.. పెరిగిన వడగాలుల తీవ్రత...: దేశంలో ఉష్ణోగ్రతల పెరుగుదలతో వడగాలుల తీవ్రత గణనీయంగా పెరిగింది. వాతావరణ విభాగం గణాంకాలను పరిశీలిస్తే 2015లో కేవలం 9 రాష్ట్రాల్లో నమోదైన వడగాలులు, 2020 నాటికి 23 రాష్ట్రాలకు విస్తరించాయన్నది విధితమవుతుంది. దేశంలో వడగాలుల రోజులు 7.4 నుంచి 32.2కు పెరిగాయి. ప్రతి సంవత్సరం 1,000 మందికి పైగా వడగాలుల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలోని సుమారు 57% జిల్లాలు తీవ్రమైన వేడి ప్రమాదంలో ఉన్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. తాజాగా శాస్త్రీయ విశ్లేషణలు కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మానవ శరీరం తట్టుకోలేని స్థాయికి చేరుతున్నాయని హెచ్చరిస్తున్నాయి. ఇది కేవలం పర్యావరణ సమస్య కాకుండా, ప్రజా ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా మారుతోంది.

వ్యవసాయ రంగం పై ప్రభావం...: వ్యవసాయం రంగం కూడా ఈ మార్పుల బారిన పడుతోంది. దేశ జనాభాలో 45% మంది వ్యవసాయంపై ఆధారపడుతున్నప్పటికీ, రుతుపవనాల అస్థిరత రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెడుతోంది. వర్షపాతం విషయానికొస్తే సమయపాలన లోపించడం, అధిక వర్షాలు పంటల వైఫల్యానికి దారి తీస్తున్నాయి. 2026లో మాన్సూన్ సాధారణం కంటే సుమారు 94% స్థాయిలోనే ఉండే అవకాశమున్నట్లు అంచనాలు సూచిస్తున్నాయి. ఇక 40% జిల్లాల్లో వరద ప్రాంతాలు క్రమంగా కరవు ప్రాంతాలుగా మారుతున్నాయి. ఇలాగే కొనసాగితే దీర్ఘకాల కరవు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. వేడెక్కుతున్న సముద్రాలు.. కరుగుతున్న హిమానీ నదాలు...: మన దేశం మూడు వైపులా ఉన్న సముద్రాలు వేడెక్కడం మరో ప్రధాన ఆందోళన. సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదలతో తుపానుల తీవ్రత పెరుగుతోంది. సముద్ర మట్టం పెరగడం వల్ల తీరప్రాంతాల్లో వరదలు అధికమవుతున్నాయి. 1995--2024 మధ్యకాలంలో ప్రపంచంలో అత్యధిక వాతావరణ ప్రభావిత దేశాల్లో భారత్ టాప్-10లో ఉండ టం ఈ ప్రమాదం స్థాయిని తెలియజేస్తోంది. మరోవైపున హిమాల యాల పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. హిమనీనదాల కరుగుదల వేగవంతమవుతోంది. దీని ఫలితంగా నదుల ప్రవాహం అస్థిరంగా మారే ప్రమాదం ఉంది. భవిష్యత్తులో సాగునీటి కొరత, తాగునీటి సమస్యలు, వలసలు పెరగడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముంది. ఇటీవల హిమాలయ ప్రాంతాల్లో కూడా వడగాలుల ప్రభావం కనిపించడం కొత్త హెచ్చరికగా భావించాలి.

ప్రజల అనుభవాల్లోనూ...: వాతావరణ మార్పు ప్రభావం కేవలం గణాంకాల్లోనే గాక ప్రజల అనుభవాల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. కొన్ని సర్వేలు చెబుతున్నట్లు దేశంలో 71% మంది తీవ్ర వడగాలులను అనుభవించగా, 52% మంది నీటి కొరతను ఎదుర్కొంటున్నారు, అలాగే 34% మంది వరదలను చూశారు. వాతావరణ మార్పు ఇప్పుడు ప్రజల రోజువారీ జీవితాల్లో ప్రత్యక్ష వాస్తవంగా మారింది.

తక్షణ చర్యలు అవసరం...: ఈ మొత్తం దృశ్యం ఒకే సందేశాన్ని ఇస్తోంది. వాతావరణ మార్పు భవిష్యత్తు సమస్య కాదు; ఇది ఇప్పటికే దేశాన్ని ప్రభావితం చేస్తున్న సంక్షోభం. ఉష్ణోగ్రతల పెరుగుదల వెనుక ఆర్థిక నష్టం, ఆహార భద్రత సమస్యలు, ఆరోగ్య సంక్షోభం, సామాజిక అసమానతలు అన్నీ దాగి ఉన్నాయి.

# భూసేకరణలతో రైతుల గుండెల్లో రైళ్లు !



రాజధాని అమరావతికి ఇప్పటికే 32వేల ఎకరాలు సేకరించారు. మరో దశలో భూసేకరణకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటి వరకు సేకరించిన భూములకు సంబంధించి రైతులకు సరైన పరిహారం దక్కలేదు. ప్లాట్లు కూడా దక్కలేదు. కౌలు కూడా అరకొరగా అందచేస్తున్నారు. అయినా రైతులు రాజధాని కోసం సర్వస్వం త్యాగం చేశారు. మరిన్ని భూములు సేకరించే ప్రయత్నంలో కొంత వ్యతిరేకత తప్పడం లేదు. మూడు పంటలు పండే, కృష్ణా పరివాహక భూములు ఇవ్వడం సాధ్యం కాదని అంటున్నారు. రైతులకు మంచి ధరలు ఇచ్చి కొనడంలో కూడా సర్కార్ మీనమేషాలు లెక్కిస్తోంది. గతంలో ఇచ్చిన భూముల రైతులకు పెద్దగా దక్కింది కూడా లేదు. ఇప్పుడది చాలదన్నట్టు 65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 189 కిలోమీటర్ల పొడవున 250 మీటర్ల వెడల్పుతో ఔటర్ రింగురోడ్డు ఒఆర్ఆర్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో గుంటూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ప్రభావిత ప్రాంతాల రైతులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పరిటాల నుండి ఇబ్రహీంపట్నం వరకూ కృష్ణానదికి సమీపంగా ఒఆర్ఆర్ నిర్మిస్తామంటూ అక్కడి భూయజమానులతో ఇటీవల అధికారులు చెప్పారు. దీంతో ఇప్పటికే మూడుసార్లు భూసేకరణ కింద భూమిని కోల్పోయామనీ, ప్రభుత్వానికి ఇంకెన్నిసార్లు భూములివ్వాలని రైతులు అభ్యంతరం తెలిపారు. మరోమారు భూసేకరణ పిడుగు పడడంతో వారు ఆందోళనలో ఉన్నారు. దేశంలో అనేక ముఖ్య నగరాల్లో ఒఆర్ఆర్, జాతీయ రహదారులు 70 మీటర్ల వెడల్పుతో నిర్మించగా అమరావతి రింగురోడ్డును 250 మీటర్ల వెడల్పుతో నిర్మించే ప్రతిపాదన సరికాదు. రైతుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వ జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్ఎఐ) డిపిఆర్ కూడా సిద్ధం చేసి, ముందుకు పోతుండడం రైతుల ప్రయోజనాలు దెబ్బతీయడమే. వారికి భూమికి భూమి ఇచ్చివుంటే సమస్యలు వచ్చి ఉండేవి కావు. రాజధాని నిర్మాణం, పట్టణాభివృద్ధి పేరిట రాష్ట్ర ప్రభుత్వం రైతులను తీవ్ర ఒత్తిళ్లకు గురిచేయడం సరైన పద్ధతికాదు. అమరావతి కోసం తొలి దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు డెవలప్ చేసిన ప్లాట్లు ఇప్పటికీ ఇవ్వలేదు. భూ యజమానులకు కౌలు, పేదలకు పింఛన్లు సరిగా అందడం లేదు. ఇబ్బందులిలా వుండగానే ఏలినవారు రెండవ దశ, అనంతరం మరింత విస్తరించడానికి భూములు సమీకరిస్తామని ఊరూరా తిరుగుతుంటే అన్నదాతల గుండెలు అదురుతున్నాయి. అదేపనిగా వేల ఎకరాలు సేకరించడం వెనక రియల్ మోసం ఉందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తొలుత రాజధాని కోసం ప్రతిపాదించిన భూమితో సరిపెట్టుకోకుండా మరోమారు భూసేకరణకు దిగారు. ఇప్పుడు ఓఆర్ఆర్ ప్రతిపాదిస్తున్న మండలాలు, గ్రామాల పరిధిలో భూములు చాలా విలువైనవి. రైతులు, కూలీల జీవనం వాటిపైనే ఆధారపడి ఉంది. ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్లో కోటి రూపాయల నుండి రెండుకోట్ల వరకూ ఉంటుంది. భూములు కోల్పోయే రైతులకు వ్యక్తిగతంగా నోటీసులు ఇవ్వకుండా కొన్ని గ్రామాల్లో సచివాలయాల ముందు భూముల సేకరణకు సంబంధించి సర్వే నెంబర్లు, ఎల్‌పి నెంబర్లు సేకరించే భూమి విస్తీర్ణం వంటి వివరాలతో నోటీసులు అతికించారు. ఇందులో ఏ రైతు భూమిని ఎంత విస్తీర్ణం ప్రభుత్వం సేకరించబోతోంది వంటి వివరాలు రైతుల వారీగా లేకపోవడంతో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం పత్రికల్లో చేసిన ప్రకటన, సచివాలయాల్లో వేలాడదీసిన పత్రాలు పారదర్శకంగా లేకపోవడంతో రైతులు భయాందోళనల్లో ఉన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు జరిపి సామాజిక ప్రభావ అంచనా వివరించి రైతులు, ప్రజల సమ్మతి పొందడం అవసరం.

అటువంటి చట్టబద్ధమైన ప్రక్రియ అమరావతి ఔటర్‌రింగు రోడ్డు ప్రతిపాదిత గ్రామాల్లో ఇప్పటి వరకూ ఎక్కడా చేపట్టకపోవడం ప్రభుత్వానికి తగదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఉన్న భూముల రేటుకు అనుగుణంగా ప్రభుత్వం పరిహారం ఇవ్వాలన్న రైతుల కోర్కె ఎంతో సమంజస మైనది. నయాయబద్ధమైనది కూడా. ఆ ప్రాంతంఅభివృద్ధి చెందితే భూముల విలువలు ఎంతగానో పెరుగుతాయని భూ సమీకరణకు రైతులను అంగీకరింపజేయడా నికి చెప్పిన ఏలికలు ఆ రైతులకు ఇప్పటి మార్కెట్ విలువనైనా పరిహారంగా చెల్లించలేదు. ఆర్ఆర్‌లో భూమి కోల్పోతున్న ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన 71 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు.

# గ్రామ, పట్టణాల అభివృద్ధి లక్ష్యం కావాలి !

గ్రామాలు, పట్టణాల ఎన్నికలు పూర్తిక ఆవడంతో ఇక అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సాగించే బాధ్యత సిఎం రేవంత్‌పై ఉంది. ఎన్నికల్లో ఎన్ని రాజకీయాలు చేసినా, అభివృద్ధి విషయంలో సమన్వయంతో అందరినీ కలుపుకుని పోవాల్సి ఉంటుంది. రానున్నది వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాల్సి ఉంది. మంచినీరు, పారిశుద్యం లాంటి సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామస్థాయిలో అవినీతి విపరీతంగా ఉంది. పంచాయితీ వ్యవహారాలను, మున్సిపల్ వ్యవహారాలను పారదర్శకంగా సాగించాలి. పూర్తిస్థాయి కంప్యూటీకరణతో పనులను వేగంగా జరిగేలా చూడాలి. ఎందుకంటే అవినీతిరహిత, పారదర్శక పాలన అన్నది గ్రామాల నుంచే ప్రారంభం కావాలి. మున్సిపాలిటీల్లో కూడా పారదర్శక విధానాలకు పెద్దపీట వేయాలి. మంచినీరు, పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. నిధుల విడుదలలో కూడా రాజకీయాలు లేకుండా చూడాలి. గ్రామాభివృద్ధిలో సర్పంచ్ ల పాత్ర అత్యంత కీలకం. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు, మున్సిపల్ ఛైర్మన్లకు పాలనా పరమైన అవగాహన కల్పించాలి. ఇప్పటికే పంచాయతీల సర్పంచ్‌లకు విడతల వారీగా శిక్షణ అందిస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్లకు, వైఎస్ ఛైర్మన్లకు కూడా శిక్షణ అందించాలని సిఎం నిర్ణయించారు. అందువల్ల పాలనా పరంగా ప్రజలకు సేవ చేసేలా శిక్షణ ఇవ్వాలి. చేయిచాపే విధానాలకు స్వస్తిపలకాలి. ఈ విషయంలో వారికి కఠినమైన ఆదేశాలు ఇవ్వాలి. పంచాయతీరాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలు, పారదర్శక పాలన అంశాలపై సవివరంగా మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్పంచ్‌లు గ్రామంలో జరుగుతున్న ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఇకపోతే కొత్తగా కొలువుదీరిన మున్సిపల్ పాలకవర్గాలకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇచ్చిన హామీలను నెరవేర్చడం సవాల్‌గా మారనుంది. పట్టణాల్లో ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజీలు కంపుకొడుతున్నాయి. అనేక వార్డుల్లో తాగునీటి సమస్యల నెలకొన్నది. విలీన గ్రామాలు, శివారు పల్లెల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. మున్సిపాలిటీల్లో పాలన గాడి తప్పింది. మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. మరోపక్క పట్టణాలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలను చేపడుతున్నా, పట్టణ ప్రణాళికశాఖ అడ్డుకోలేకపోతున్నది. పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా, పనులు ప్రారంభంకాక పోవటంతో అభివృద్ధికి నోచుకోవడంలేదు. మరోపక్క పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టడం లేదు. ఇన్ని సమస్యలు, సవాళ్ల మధ్య కొత్త పాలకవర్గం బోధన్ మున్సిపాలిటీలో పాలనా పగ్గాలు చేపట్టింది. వీధి కుక్కల బెడద గ్రామాలు మొదలు, పట్టణ్నాల వరకు ఉంది. కోతుల సమస్య అత్యంత దారుణంగా ఉంది. వీటి నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకుంటే ఇదో పెద్ద సమస్యలగా పరిణమించడం ఖాయం. దోమలు విజృంభిస్తున్నాయి. దీనికితోడు అంటువ్యాధుల బెడద ఉంది. మిషన్ భగీరథ పేరుతో ఊదరగొట్టినా పాత మంచినీటి పథకాలకే కొత్తగా పేరు పెట్టారు. ఎక్కడా సక్రమంగా మంచినీటి వ్యవస్థ లేకుండా పోయింది. తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో పలు పట్టణాల్లో కొత్తగా వెలసిన శివారు కాలనీలకు తాగునీరు అందడంలేదు. తరచుగా తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోతున్నాయి. తాగునీటి లీకేజీలను అరికట్టడం మున్సిపాలిటీలకి సమస్యగా మారింది. ఈ దశలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం 'అమృత్ 2.0' పథకం కింద పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఈ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. వచ్చే వేసవినాటికి తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు పూర్తిచేయాల్సిన బాధ్యత కొత్త పాలకవర్గంపై ఉంది. పెద్ద గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చారు. పలు శివారు గ్రామాలను కలిపేసారు. మున్సిపాలిటీలో పదేండ్ల క్రితం చుట్టుపక్కల ఉన్న గ్రామాలు విలీనమయ్యాయి.అక్కడి ప్రజలపై పన్నుల భారం పెరిగిందే తప్ప, అందుకు తగిన అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. ముఖ్యంగా పట్టణ శివారుల్లోని కాలనీలు కనీసం రోడ్లు, డ్రైనేజీలకు నోచుకోవడం లేదు. శ్మశాన వాటికల సమస్య తీవ్రంగా ఉంది. పట్టణాల్లో కొన్నిచోట్ల దాతల సహకారంతో పునర్నిర్మించినా వందలవేల సంఖ్యలో శ్మశాన వాటికలు అధ్వా న్నంగా ఉన్నాయి. ఇకపోతే ఇంటింటికీ చెత్త సేకరణ రోజు విడిచి రోజు జరుగు తున్నప్పటికీ, ఈ సేకరణ సక్రమంగా జరగడంలేదు. పారిశుధ్య కార్మికుల కొరత, సరిపడా చెత్త వాహనాలు లేకపోవడం ఇందుకు కారణం. పెద్ద రోడ్లను శుభ్రపరిచే స్వీపింగ్‌మెషిన్లను రంగంలోకి దింపాల్సి ఉంది.

# గ్రేటర్ లో కోర్ అర్బన్ యాక్ట్




హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మహా నగరాభివృద్ధి కోసం దశాబ్దాల కాలం నాటి పాత చట్టాలను పక్కన పెట్టి, అత్యంత శక్తివంతమైన కోర్ అర్బన్ రీఫార్మ్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ చట్టాన్ని తీసుకువస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న జీహెచ్ ఎంసీ చట్టం స్థానంలో రాబోయే ఈ కొత్త చట్టం, నగర పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. ప్రధానంగా అక్రమ కట్టడాల నియంత్రణ, చెరువుల సంరక్షణ , విపత్తు నిర్వహణను ఒకే గొడుగు కిందికి తీసుకురావడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం.ఈ కొత్త చట్టం ద్వారా హైడ్రా కు తిరుగులేని చట్టబద్ధమైన అధికారాలు లభించనున్నాయి. ఇప్పటివరకు అక్రమ నిర్మాణాల కూల్చివేతకు హైడ్రా అధికారులు ఇతర మునిసిపల్ విభాగాలపై లేదా రెవెన్యూ అధికారుల నోటీసులపై ఆధారపడాల్సి వచ్చేది. కానీ కోర్ చట్టం అమలులోకి వస్తే, హైడ్రా నేరుగా అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసే అధికారంతో పాటు, తక్షణమే కూల్చివేతలు చేపట్టే విచక్షణాధికారాలను కూడా పొందుతుంది. దీనివల్ల కాలయాపన తగ్గి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుంది. నగర పరిధిలోని ప్రభుత్వ భూములు, ఎఫ్టీఎల్ పరిధులు , బఫర్ జోన్ల ఆక్రమణలను అడ్డుకోవడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుంది. నోటీసులు ఇచ్చే ప్రక్రియను డిజిటలైజ్ చేయడం ద్వారా పారదర్శకతను పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా, నిబంధనలు ఉల్లంఘించే భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేసేలా కఠిన నిబంధనలను ఇందులో పొందుపరిచారు. ఇది క్షేత్రస్థాయిలో అవినీతిని అరికట్టడానికి దోహదపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.కోర్ చట్టం కేవలం అక్రమ కట్టడాల కూల్చివేతకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఒక ప్రణాళికాబద్ధమైన ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు పునాదిగా నిలవనుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నాటి పాత చట్టాల వల్ల ఎదురవుతున్న న్యాయపరమైన చిక్కులను అధిగమిస్తూ, నూతన తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ఈ చట్టాన్ని రూపొందిస్తున్నారు. అసెంబ్లీలో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి, అధికారికంగా అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

## లారీ లో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం స్వాధీనం
### ముగ్గురు అరెస్ట్, లారీ సీజ్

మహబూబాబాద్ : జిల్లా టాస్క్ ఫోర్స్, కురవి పోలీస్ సంయుక్త ఆపరేషన్లో భాగంగా అక్రమ సారాయి తయారీకి ఉపయోగించే నల్లబెల్లం రవాణాపై చర్యలు చేపట్టారు. చిత్తూరు నుండి మహబూబాబాద్ వైపు అక్రమంగా తరలిస్తున్న లారీని కురవి శివారు సోమ్లా తండా సమీపంలో ఆపి తనిఖీ చేయగా, అందులో సుమారు ?8,00,000 విలువైన 70 క్వింటాళ్ల నల్లబెల్లం మరియు 10 క్వింటాళ్ల పట్టిక స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులు గుగులోత్ సుమన్, ఆరెపల్లి మధు, బొల్లా విజయ్ కుమార్ లను అరెస్ట్ చేసి, లారీని సీజ్ చేసారు. ఈ ఆపరేషన్లో టాస్క్ ఫోర్స్ సిఐ హతీరామ్, ఎస్సై తాహేర్ బాబా, కురవి ఎస్సైగంద్రాతి సతీష్, ఎస్సై జయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# వర్క్ ఫ్రమ్ హోమ్ అంటూ సెటైర్లు




హైదరాబాద్ : సాధారణంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' ఆప్షన్ ఉంటుందని మనందరికీ తెలుసు. కానీ ఒక రాష్ట్రానికి ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉంటూ సభ గడప తొక్కకుండానే "అటెండెన్స్ అక్కర్లేని అసాధారణ ఉద్యోగి" గా కొత్త రికార్డు సృష్టించారు మన గులాబీ బాస్. 'రాజ్యం పోయినా రాచరికం పోలేదు' అన్న సామెతను నిజం చేస్తూ గజ్వేల్ ఫామ్ హౌస్ నుంచే ప్రజాస్వామ్యాన్ని శాసిస్తున్న తీరుపై ఇప్పుడు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు.సామాన్యుడు ఒక్క రోజు ఆఫీస్ మానేస్తే జీతంలో కోత పడుతుంది. కానీ మన ప్రతిపక్ష నేత గారికి మాత్రం ఇప్పటి వరకు అక్షరాలా రూ. 1.06 కోట్ల జీతభత్యాలు ప్రభుత్వం చెల్లించింది. సభకు వచ్చి ప్రజా సమస్యలపై గళం ఎత్తాల్సిన బాధ్యతను పక్కన పెట్టి, కేవలం అకౌంట్‌లో పడే మెసేజ్‌లకే పరిమితమైన ఈ 'రాజకీయం' చూసి సామాన్యులు నోరెళ్లబెడుతున్నారు. "కోటి రూపాయల జీతం తీసుకుంటూ కోలుకోలేని నిద్రలో ఉండటం" అంటే ఇదేనేమోనని చర్చించుకుంటున్నారు.గవర్నర్ శివప్రతాప్ శుక్లా అసెంబ్లీలో 'తెలంగాణ రైజింగ్ 2047' అంటూ భవిష్యత్ ప్రణాళికలు వివరిస్తుంటే.. ప్రధాన ప్రతిపక్షం మాత్రం "మేము రాము.. మాకు ఆ విజన్ డాక్యుమెంట్లు పట్టవు" అన్నట్లుగా వ్యవహరించింది. దీనిపై రేవంత్ సెటైర్ వేశారు. ఏఐ (ఎఐ) సునామీ రాబోతోందని గవర్నర్ చెబితే, ప్రతిపక్షం మాత్రం ఇంకా పాత రికార్డులే వేస్తోంది. కనీసం విజన్ డాక్యుమెంట్ చదివారా? అంటే.. "మాకు అధికారం పోయిన దుఃఖం చదవడానికే టైమ్ సరిపోవడం లేదు" అన్నట్లుగా ఉందని ఎద్దేవాచేశాడు.నాలుగు కోట్ల మంది ప్రజలు తమ గొంతుక వినిపిస్తారని అసెంబ్లీ వైపు చూస్తుంటే, ప్రతిపక్ష నాయకుడు మాత్రం గవర్నర్‌కు కనీసం శుభాకాంక్షలు చెప్పడానికి కూడా రాలేదు. సభకు రాకుండా జీతం తీసుకోవడం అనేది ఒక "మాయని మచ్చ" అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అంటే విధులకు హాజరు కాకుండా జీతం తీసుకునే ఈ కొత్త ట్రెండ్‌పై ఇప్పుడు స్పెషల్ క్లాస్ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అసెంబ్లీకి రాకుండా జీతం తీసుకోవడం అనేది 'కళ' అయితే.. అందులో కేసీఆర్ గారు 'ఆస్కార్' రేంజ్ పర్ఫార్మెన్స్ ఇస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెవులు కొరుక్కుంటున్నారు. మరి ఈ 'కోటి రూపాయల అటెండెన్స్' వివాదం ఎటు దారితీస్తుందో చూడాలి!

## మౌలిక సదుపాయాలతో పాటు నాణ్యమైన పోషకాహారం ఇవ్వాలి
### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఖమ్మం : ప్రభుత్వ సంరక్షణలో ఉన్న ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగడం ప్రభుత్వ లక్ష్యమని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలు చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం నగరంలోని ఎన్.ఎస్.పి. రోడ్‌లోని బాలల సదనాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలలో తిరుగుతూ పరిశుభ్రత, మౌలిక వసతులు, పడక గదులు, బాత్‌రూములు, త్రాగునీటి సదుపాయం, వంటగది నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు. వంటగదిలో తయారవుతున్న ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా చూసి, పిల్లలకు అందిస్తున్న అల్పాహారం, భోజనం కామన్ మెనూ ప్రకారం సరైన ప్రమాణాలతో అందుతున్నాయా అని తెలుసుకున్నారు. అన్నం, కూరలు, పప్పు, సాంబారు, గుడ్లు, చికెన్ వంటి పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు.పిల్లలతో నేరుగా ముచ్చటించిన కలెక్టర్, భోజనం రుచిగా ఉందా, సమయానికి అందిస్తున్నారా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.పిల్లల అభిప్రాయాలను వినడం ద్వారా సేవల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ బాలల సదనాల్లో ఉన్న పిల్లలు మన కుటుంబ సభ్యుల్లాంటి వారని, వారికి అందించే ఆహారం పోషక విలువలతో కూడినదిగా, రుచికరంగా ఉండాలని అన్నారు. పరిశుభ్రత, ఆరోగ్య సేవలు, భద్రత అంశాల్లో ఎల్లప్పుడూ అత్యున్నత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పిల్లలలో ఆత్మవిశ్వాసం పెంచే విధంగా విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించాలని అన్నారు. దత్తత ప్రక్రియలో పారదర్శకత అత్యంత ముఖ్యమని, అర్హత కలిగిన కుటుంబాలకు మాత్రమే చట్టపరమైన విధానాల ప్రకారం పిల్లలను దత్తత ఇవ్వాలని, ప్రతి దశలో బాలల హితం ప్రాధాన్యంగా ఉండే విధంగ బాలల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత, జిల్లా శిశు సంరక్షణ అధికారిణి విష్ణు వందన, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నట్టింట్లో కల్తీ రక్కసి

హైదరాబాద్: భారతదేశంలో ఆహార కల్తీ రక్కసి కోరలు చాస్తున్నది. యేటా దేశవ్యాప్తంగా కల్తీ ఆహారం కారణంగా సుమా రు 70 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారనే చేదు నిజాన్ని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ప్రకారం.. భారత్‌లో యేటా 10 కోట్ల మంది కల్తీ ఆహారం తీసుకుని అనారోగ్యానికి గురవుతున్నారు. ఇందులో 20 శాతం మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. ఫలితంగా నిల్వ ఉంచిన కలుషిత ఆహారం కొనుక్కుని తిని మరీ ప్రజలు రోగాలను కొనితెచ్చుకుంటున్నారు.ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఆహార భద్రతా ప్రమాణా ల అమలులో ఆంధ్రప్రదేశ్ గత ఐదేళ్ల కాలం లో అట్టడుగు స్థానానికి పడిపోయింది. తెలు గు రాష్ట్రాల్లో పాల కల్తీ నిరంతరాయంగా సాగుతున్న ఒక ప్రమాదకర వ్యాపారంగా మారింది. పసి పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి రోజూ వినియోగించే పాలు ఇప్పుడు విషపూరిత రసాయనాలతో నిండిపోతున్నాయి. పాల సాంద్రత పెంచేందుకు గంజి పొడిని వాడుతున్నారు.వంటగదిలో నిత్యం వినియోగించే పదార్థాలు, మసాలాలన్నీ ఇప్పుడు కల్తీ కాటుకు గురవుతున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు ప్రధాన పట్టణాల్లో తరచూ 'కల్తీ'కారుల అక్రమాలు వెలు గు చూడటం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల మైలార్‌దేవ్‌పల్లి, లాలాగూడల్లో అపరిశుభ్ర వాతావరణంలో తయారవుతున్న కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ కేంద్రాలపై పోలీసులు జరిపిన దాడులు ఒక ఎత్తయితే, బంజారాహిల్స్ వంటి సంపన్నుల నివాస ప్రాంతంలో 'ఫ్రైడ్ డెయిరీ' పేరిట సాగుతున్న కల్తీ నెయ్యి దందా మరో ఎత్తు.కేవలం అల్లం వెల్లుల్లి, నెయ్యి మాత్రమే కాదు.. మనం నిత్య ఇంట్లో వినియోగించే పాలు, కారం, నూనె నుంచి టీ పొడి చివరకు.. ప్రతీది నకిలీమయం అవుతుండటం ఆందోళనకరం. శంషాబాద్ జోన్ పరిధిలోని జల్‌పల్లి, పహాడీషరీఫ్ ప్రాంతాల్లో పట్టుబడి న కల్తీ పదార్థాల తయారీ కేంద్రాలను పరిశీలిస్తే, ఆహార భద్రత ప్రమాణాలను గాలికొదిలేసి, లాభార్జనే ధ్యేయంగా దందా సాగినట్లు స్పష్టమ వుతున్నది. కల్తీల వెనుక వాస్తవాలు అత్యంత దారుణంగా ఉన్నాయి.అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీలో అక్రమార్కులు కుళ్లిన అల్లం, తక్కువ నాణ్యత గల వెల్లుల్లికి తోడు.. జిగురు కోసం ప్రమాదకరమైన 'ఎక్స్‌జన్ గమ్ పౌడర్', రంగు కోసం సింథటిక్ రసాయనాలు, నిల్వ ఉండటానికి అధిక మోతాదులో సిట్రిక్ యాసిడ్ వాడినట్లు అధికారులు గుర్తించారు. ఈ పదార్థాలు మనిషి శరీరంలోకి వెళితే జీర్ణకోశ వ్యాధుల నుంచి మొదలుకొని దీర్ఘకాలంలో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది.కల్తీ నెయ్యి విషయానికొస్తే, అక్రమార్కులు తక్కువ ధరకు లభించే పామాయిల్, డాల్డా, హైడ్రోజనేటెడ్ వెజిటబుల్ ఫ్యాట్స్‌ను ఆవు, గేదె పాల మీగడలో కలిపి తమదే స్వచ్ఛమైన నెయ్యి అని మార్కెట్లోకి వదులుతున్నారు. పాల ను చిక్కగా మార్చేందుకు వీరు యూరియా, డిటర్జెంట్ పొడి, గ్లూకోజ్, స్టార్చ్ పౌడర్లు వాడుతున్నట్లు తేలింది. ఈ నెయ్యిని వినియోగిస్తే కాలేయం దెబ్బతినడం, మూత్రపిండాల వైఫల్యం, గుండె సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.అసలు ఈ కల్తీ మహమ్మారి ఇంతలా వేళ్లూనుకోవడానికి మారుతున్న జీవనశైలే ప్రధాన కారణమని విశ్లేషకులు చెప్తున్నారు. ఆధునిక కాలంలో 'ఇన్‌స్టంట్ ఫుడ్'పై మోజు, ఏ వంట అయి నా త్వరగా సిద్ధమైపోవాలనే ఆతృత.. కల్తీ కేటుగాళ్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఇంట్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసుకునే ఓపిక లేకపోవడం, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్స్ ద్వారా వచ్చే ఆకర్షణీయమైన ఆఫర్ల వెంట పడటం వల్ల మనం తెలియకుండానే విషాన్ని కొని తెచ్చుకుంటున్నాంతక్కువ ధరకే దొరుకుతున్నాయని నాణ్యతను పట్టించుకోకుండా రోడ్డు పక్కన విక్రయించే విడి అల్లం పేస్ట్‌లు, లోకల్ బ్రాండ్ నెయ్యి ప్యాకెట్లను ఆశ్రయించడం ప్రాణాంతకం. హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో లాభాల కోసం ఇలాంటి కల్తీ ఉత్పత్తులనే వాడుతున్నట్లు యంత్రాంగం విచారణలో తేలడం గమనార్హం. కేవలం పోలీసుల దాడులు, అరెస్టులతోనే ఈ వ్యవస్థ ప్రక్షాళన కాదు. వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలిసాధ్యమైనంత వరకూ ఇంట్లో తయారు చేసుకునే పదార్థాలనే, వినియోగించు కోవడం ఉత్తమం. అధిక లాభాల కోసం సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ ముఠాలపై ప్రభుత్వాలు కఠిన చట్టాలను ప్రయోగించి, కల్తీ మహమ్మారికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతై నా ఉంది.పాలు తెల్లగా కనిపించేందుకు అక్రమార్కులు వైట్ పెయింట్ ను ఉపయోగిస్తున్నారు. నిల్వ ఉంచేందుకు ఫార్మాలిన్ వంటి రసా యనాలను వాడుతున్నారు. కేవలం లాభాపేక్షే ధ్యేయంగా నకిలీ పాల రైతులు అవతారమెత్తి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఒక పాడి గేదె పెంపకం దారు వద్ద రెండు మూడు గేదె లు ఉంటే 20 నుంచి 30 మంది వినియోగదారులు ఉంటున్నారు.ఈ అదనపు పాలు ఎక్కడ నుంచి వస్తున్నాయో దేవుడికే తెలియాలి. బజారుకొకటి ఉంటున్న ప్రైవేట్ పాల కేంద్రాలు కాన్ల కొద్దీ పాలను విక్రయిస్తున్నాయి. ఈ కేంద్రాల్లో యూరియా బస్తా ల నిల్వలు కనిపిస్తున్నాయి. పంటలకు దొరకని యూరియా ఇక్కడ నిల్వ ఉండటం వెనుక అసలు పరమార్థం ఇదే.ల కల్తీ కోసం అక్రమార్కులు యూరి యా, ఫార్మాలిన్,
డిటర్జెంట్లు, అమ్మోనియం సల్ఫేట్, కాస్టిక్ సోడా వంటి భయంకరమైన రసాయనాలను ఉపయోగిస్తున్నారు. పాల సాంద్రతను పెంచేందుకు గంజి పొడిని కలుపుతున్నారు. నీళ్లు కలిపిన పాలు చిక్కగా కనిపించేందుకు సబ్బును ఉపయోగిస్తున్నారు. వైట్ పెయింట్ ని పాలలో కలపడం కల్తీ దారుల మితిమీరిన తెలివికి నిదర్శనం. వీటివల్ల మూత్రపిండాల వ్యాధులు, క్యాన్సర్, జీర్ణకోశ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫార్మాలిన్ రసాయనం కాలేయం, మూత్రపిండాలపై హానికరమైన ప్రభావాన్ని చూపు తుంది.పాలలో లాక్టోమీటర్ పరీక్షలతో కూడా గుర్తించలేని విధంగా కార్బోహైడ్రేట్లు కలుపుతున్నారు. ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆహార భద్రతా శాఖతో తరచూ ఆకస్మిక దాడులు నిర్వహించి కల్తీకి పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. లేనిపక్షంలో సామాన్య ప్రజలు రోగాలపాలై అర్ధాంతరపు చావులకు గురికాక తప్పదు.

# హాబీగా స్మారక నాణేల సేకరణ..

ఒక్కొక్కరికి ఒక్కో అలవాటు ఉంటుంది. అది ప్రత్యేక హాబీగా రూపొందితే– ఆ వ్యక్తికి కూడా గుర్తింపు తెచ్చి పెడుతుంది. కొందరికి స్టాంపులు.. ఇంకొకరికి నాణేలు... మరికొందరికి అరుదైన వస్తువుల సేకరణ .. గార్డెనింగ్.. సూక్ష్మకళలు హాబీలుగా ఉంటాయి. అరుదైన స్మారక నాణేల సేకరణ హాబీగా పెట్టుకున్నారు కోడూరి నాగ సూర్య రాఘవేంద్రబాబు. అనేకమంది ప్రముఖుల స్మారకంగా విడుదల అయిన నాణేలను సేకరించారు. అవి చరిత్రను చెబుతాయి. ఆయా వ్యక్తుల ప్రాముఖ్యాన్ని వివరిస్తాయి. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు గ్రామానికి చెందిన కోడూరి ప్రసాద్, అన్నపూర్ణ దంపతుల కుమారుడు కోడూరి నాగ సూర్య రాఘవేంద్ర బాబు మే 26, 1999లో జన్మించారు. స్టాంపుల సేకరించిన ప్రముఖుల గురించి వార్తా పత్రికల్లో చూసి చిన్నప్పుడే తను కూడా ఏదో ఒకటి చేసి గుర్తింపు తెచ్చుకోవాలని భావించారు. అరుదైన నాణేలను సేకరించటంపై ఆసక్తి పెంచుకున్నాడు. తన పదో ఏట నుంచే దీనిని ప్రారంభించాడు. బిటెక్ తర్వాత ఎంబిఎ హెచ్‌ఆర్ విభాగంలో పూర్తిచేసిన ఆయన గత 15 సంవత్సరాలుగా స్టాంపులు, నాణేలు, అరుదైన వస్తువుల సేకరణ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆయన వద్ద మనదేశానికి సంబంధించి ఆర్‌బిఐ ముద్రించిన పలు నాణేలు ఉన్నాయి. పాత నాణేలను సేకరించటం ఆయనకు ఫ్యాషన్. ఇప్పటివరకూ 200కుపైగానే కాయిన్స్ సేకరించి భద్రపర్చారు.

అరుదైనవి.. అలవోకగా...: మన దేశంలో మొదటిసారిగా మొఘల్ చక్రవర్తి అక్బర్ హయాంలో స్మారక నాణేలా విడుదల ప్రారంభమైంది. స్వాతంత్ర్యం అనంతరం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశస్థాయిలో ముఖ్యమైన సంఘటనలు, ప్రముఖ వ్యక్తులకు సంబంధించిన స్మారక కాయిన్స్ విడుదల చేస్తోంది. అలా విడుదల చేసిన వాటిలోనూ, తను సేకరించిన కాయిన్స్ ఉన్నాయి. వాటిలో జాతిపిత మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభారు పటేల్, తత్వవేత్త ఓషో పేరిట స్మారక నాణేలు ఉన్నాయి. 80 ఏళ్ల కామన్‌వెల్త్ గేమ్స్, ఇండియన్ రైల్వేస్, మదర్ థెరిస్సా, మదర్స్‌హెల్త్, రవీంద్రనాథ్ ఠాగూర్, సుప్రీంకోర్టు, మోతీలాల్ నెహ్రూ, మహారాణా ప్రతాప్, జగత్‌గురు నారాయణ, బయోడైవర్సిటీ, ఇన్‌కంటాక్స్, చైల్డ్‌హెల్త్, డైమండ్‌జూబ్లీ, 60 ఏళ్ల పార్లమెంట్, కూకామూవెంట్, బ్యాంక్ నగర (మలేషియా), ఆచార్య తులసి, బాబూ రాజేంద్రప్రసాద్, భగత్‌సింగ్, లూయిస్ బ్రెయిలీ, ఐఎల్ఒ, ఒఎన్‌జిసి, ఢిల్లీ కామన్‌వెల్త్‌గేమ్స్ వంటి అంశాలకు సంబంధించిన కాయిన్స్‌ను సేకరించారు. మనదేశంతోపాటుగా విదేశాలకు చెందిన కాయిన్స్‌ను కూడా కొన్నింటిని సేకరించారు.

భావితరాల కోసం...: ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచి ఫోన్ పే, గూగుల్‌పే, పేటీఎం అంటూ డిజిటల్ కరెన్సీకి అలవాటు పడిపోయాం. నాణేలు, కరెన్సీ వాడకం చాలావరకూ తగ్గిపోయింది. భావితరాలకు గతకాలపు నాటి నాణేలు గురించి తెలిసే అవకాశం చాలా తక్కువ. అందుకే భావితరాలకు తనవంతుగా కొంతమేరకైనా పరిజ్ఞానాన్ని పెంపొందించటానికి పురాతనకాలం నాటి అరుదైన నాణేలను సేకరించి భద్రపర్చటం, వాటిని ప్రదర్శించటం ద్వారా భావితరాలకు తెలియ జేయటానికి ఆయన కృషిచేస్తున్నారు. నాణేల రారాజుగా ఆయన్ను కొందరు పిలుస్తుంటారు. రాజుల కాలం నాటి నాణేలు, బ్రిటీషు వారు రూపొందించిన స్మారక చిహ్నాలు వంటివి కూడా కొన్ని ఉన్నాయి. మనం విడిచిపెట్టిన పైసలే కాదు, బేడ, దమ్మిడి, కాసులు ఆయన వద్ద భద్రంగా ఉన్నాయి. వివిధ సంవత్సరా ల్లో జారీ చేసిన స్వాతంత్ర్య సమరయోధుల నాణేలు ఆయన వద్ద అబ్బుర పరుస్తాయి. సిఎం నారా చంద్రబాబు నాయుడుతోపాటుగా పలువురు మంత్రులు, మాజీ మంత్రులు, కలెక్టర్లు ఇతడి కృషిని అభినందించారంటే ఆశ్చర్యం కలుగక మానదు. అనేక అరుదైన నాణేలను సేకరిస్తూ ఆయన పలువురి చేత శభాష్ అనిపించుకున్నారు.

పురాతన, చారిత్రక అంశాలు తెలిపేలా...: పురాతన, అరుదైన, విదేశీ నాణేలతో చరిత్ర, సంస్కృతిని తెలుసుకోవచ్చు.శతాబ్దాలనాటి నాణేలతో ఆయా కాలాల గురించి కొంతైనా మననం చేసు కోవచ్చు. నిజాం, బ్రిటీష్ కాలం నాటి పైసలు, నాణేలు అరుదుగా దొరుకుతాయి.

చాప్లిస్లపైనా మైక్రోఆర్ట్ చిత్రీకరణలు: నాణేల సేకరణ ఒక ఎత్తయితే వాటిని భద్రపర్చటం ఇంకో ఎత్తు. చాప్లిస్లపై పెన్సిళ్లతోనూ, పెన్నుతోనూ పలు ప్రభుత్వ పథకాలు గురించి రాసి సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల సందర్భంగా ప్రముఖులకు అందజేయటం అతడికి అలవాటుగా మారింది. స్వాతంత్ర్య సమరయోధుల వర్ధంతులు, జయంతుల సందర్భంగా సభలకు హాజరయ్యే అతిథులను కలిసి అందజేస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన రిపబ్లిక్‌డే వేడుకల్లో ఆయన జిల్లాకలెక్టర్‌ను కలిసి చాప్లిస్‌పై రాసినది ఇచ్చారు. 2019లో అప్పటి సిఎం నారా చంద్రబాబు నాయుడు పేరును చాప్లిస్‌పై రాసి ఇవ్వగా ఆయన ఎంతో సంతోషించారు. పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా గతంలో అప్పటి జెఎన్‌టియు విసి మాజీ గొట్టుముక్కల ప్రసాద్ రాజుకు జాతీయజెండా ప్రతిరూపాన్ని తీర్చిదిద్ది ఇచ్చారు.

సామాజిక సేవల్లోనూ..: 2022లో ఆయనతోపాటుగా తీపర్రు గ్రామానికి చెందిన స్నేహితులు బాలాజీ, సత్యనారాయణ, వంశీ, సురేష్, సుభాష్‌లతో కలిసి అబ్దుల్ కలాం సేవా సమితిని ఏర్పాటుచేశారు. పచ్చదనం–పరిశుభ్రత కార్యక్రమాలతోపాటుగా గ్రామంలో స్వచ్ఛభారత్ వంటి కారక్రమాలను గ్రామస్తులతో కలిపి నిర్వహిస్తున్నారు. సమీపంలోని పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు పండుగలు, ప్రముఖ జాతీయ నాయకుల వర్ధంతులు, జయంతుల సందర్భంగానూ, స్వాతంత్ర్య దినోత్సవం, భారత రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా పిల్లలకు పండ్లు, పెన్సిళ్లు, స్కేళ్లు, అల్పాహారాలు వంటివి కూడా అందజేస్తున్నారు.

భావితరాల కోసమే...: భావితరాలకు మన కరెన్సీని విషయాలను అప్పటి చారిత్రక విషయాలను తెలియజేసేందుకు నేను కాయిన్స్ సేకరిస్తున్నా. సేకరించిన వాటిని ఎగ్జిబిషన్ల ద్వారా ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా. కొన్నేళ్లుగా ఈ కృషిని కొనసాగిస్తున్నా. ఈ సేకరణతో నేటి తరానికి చరిత్రను తెలియజేస్తున్నాం. 2019లో సిఎం చంద్రబాబు నాయుడును కలిశాను. ఆయన అభినందించారు. నాకు మంచి భవిష్యత్తు చూపిస్తానని చెప్పారు.

# ఏథర్ రిజ్టా విక్రయాల్లో దూకుడు!



భారతదేశపు ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ ఒక ప్రధాన మైలురాయిని సాధించింది. కంపెనీ మొత్తం అమ్మకాలు 600,000 యూనిట్లను అధిగమించాయి. ప్రభుత్వ డేటా ప్లాట్‌ఫామ్ అయిన వాహన్ పోర్టల్ ప్రకారం..ఏథర్ ఇప్పటివరకు మొత్తం 604,997 యూనిట్లను విక్రయించింది. దీనితో ఈ కంపెనీ భారతదేశపు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విభాగంలో అగ్ర మూడు కంపెనీలలో ఒకటిగా నిలిచింది. 2018లో మొదలైన ఏథర్ ప్రయాణం, 2022లో వృద్ధి వేగవంతమైంది. ఆ సంవత్సరంలో 51,811 యూనిట్లు అమ్ముడయ్యాయి. తదనంతరం 2023లో మొత్తం అమ్మకాలు 1.26 లక్షల యూనిట్లకు చేరుకున్నాయి. 2025 నాటికీ 201,129 యూనిట్లను విక్రయించి, 2026లో ప్రారంభం నుండి ఏప్రిల్ 22 మధ్య, ఏథర్ 99,159 యూనిట్లను విక్రయించి, బలమైన డిమాండ్‌ను ప్రదర్శించింది.

ఏథర్ అత్యధికంగా అమ్ముడయ్యే స్కూటర్ ఏథర్ రిజ్టా. కంపెనీ మొత్తం అమ్మకాలలో ఇది ఒక్కటే సుమారు 70-75% వాటాను కలిగి ఉంది. కంపెనీ టీవీఎస్ ఐక్యూబ్, బజాజ్ చేతక్ వంటి మోడళ్లతో పోటీ పడటానికి ప్రత్యేకంగా రిజ్టాను ప్రారంభించింది. దీని అతిపెద్ద ప్రత్యేకత దాని బ్యాటరీ-యాజ్-ఎ-సర్వీస్ (ఢీఝూ) మోడల్. ఇది వినియోగదారులకు తక్కువ ధరను అందిస్తుంది. దీని ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర సుమారు రూ.1.16 లక్షలు కాగా, ఢీఝూ మోడల్‌తో దీని ధర సుమారు రూ.76,000కు తగ్గుతుంది. ఏథర్ ఎనర్జీ ఇప్పుడు తన తయారీ సామర్థ్యాన్ని వేగంగా విస్తరించడానికి కృషి చేస్తోంది. కంపెనీ తన వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 420,000 యూనిట్ల నుండి 1420,000 యూనిట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. కంపెనీకి హోసూర్‌లో రెండు ప్లాంట్లు ఉన్నాయి. అదనంగా, ఛత్రపతి సంభాజీనగర్‌లో మూడవ ప్లాంట్ నిర్మిస్తోంది. దీని మొదటి దశ 2026 ద్వితీయార్థంలో ప్రారంభమవుతుందని అంచనా! వేగంగా విస్తరిస్తున్న నెట్‌వర్క్ ఏథర్ దేశవ్యాప్తంగా తన సేవా కేంద్రాలను వేగంగా విస్తరిస్తోంది. కంపెనీకి ఇప్పుడు 700కు పైగా టచ్‌పాయింట్లు ఉన్నాయి. కేవలం 2026లోనే, కంపెనీ తన నెట్‌వర్క్‌ను 277 నుండి దాదాపు 500 టచ్‌పాయింట్లకు విస్తరించింది. రాబోయే సంవత్సరాల్లో ఏథర్ భారతదేశం అంతటా తన ఉనికిని బలోపేతం చేసుకోవడానికి సిద్ధంగా ఉందని ఇది స్పష్టంగా సూచిస్తుంది.

# వృద్ధిరేటుకు గల్ఫ్ దెబ్బ..!




దేశ జీడీపీ ఈసారి తగ్గొచ్చు శ్రీ 6.3 శాతానికే పరిమితమంటున్న ఏడీబీ

సమర్‌కండ్ (ఉజ్బెకిస్థాన్)/న్యూఢిల్లీ : అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం.. భారత జీడీపీ వృద్ధికి అడ్డుపడుతున్నది. ఇప్పటికే ఈ మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతల వల్ల దేశంలో ఇంధన సమస్యలు తలెత్తిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఇప్పుడు ఆర్థిక వృద్ధికి సైతం ఇబ్బందులు తప్పవన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే భారత జీడీపీ అంచనాలకు తాజాగా ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) కోతలు పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) 6.3 శాతానికే పరిమితం కావచ్చని ఏడీబీ వార్షిక సమావేశం సందర్భంగా దాని ప్రధాన ఆర్థికవేత్త ఆల్బర్ట్ పార్క్ మంగళవారం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అన్నారు. గత నెలలో 6.9 శాతంగా ఉండొచ్చనగా.. ఇప్పుడు అందులో 0.6 శాతం తగ్గించారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరం (2027-28) 7.3 శాతం జీడీపీ నమోదు కావచ్చని ఏప్రిల్‌లో ఏడీబీ చెప్పింది. అయితే తాజా అంచనాలతో ఇది కూడా తగ్గిపోయే అవకాశాలే కనిపిస్తున్నాయి. దేశీయంగా ఉండే బలమైన డిమాండ్‌ను పెరుగుతున్న ద్రవ్యోల్బణం దెబ్బతీస్తుండటమే.. వృద్ధి అంచనాల తగ్గుదలకు కారణమన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం మొదలైంది. అంతకుముందు బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 70 డాలర్లే. కానీ ఇప్పుడు 40 డాలర్ల మేర పెరిగింది. ప్రస్తుతం 110 డాలర్ల వద్ద కదలాడుతున్నది. అమెరికా క్రూడ్ బెంచ్‌మార్క్ సైతం బ్యారెల్ 100 డాలర్లకుపైగా సూచిస్తున్నది. దీంతో మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు కొనసాగితే.. ముడి చమురు రేట్లు మరింతగా విజృంభించడం ఖాయమే. ఇక పెరుగుతున్న ముడి చమురు ధరలు.. అనుబంధ రంగాలనూ దెబ్బతీస్తున్నాయి. యుద్ధం మొదలై 2 నెలలు దాటిపోవడంతో ఇప్పటికే రిటైల్ మార్కెట్లో ఆయా ఉత్పత్తుల ధరల్ని కంపెనీలు పెంచేశాయి. వివిధ రకాల సబ్బులు, రంగులు, ఎరువుల రేట్లు ప్రత్యక్షంగా.. మిగతా వాటి ధరలు పరోక్షంగా పెరగడంతో వినియోగదారులపై ఆ భారం పడుతున్నది. దేశీయ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో మెజారిటీ వాటా సౌదీ అరేబియా, కువైట్, ఖతార్ తదితర గల్ఫ్ దేశాలదే. రష్యా నుంచి కూడా పెద్ద ఎత్తునే కొంటుండగా.. అమెరికా ఆంక్షలు అందుకు అడ్డుతగులుతున్నాయి.

ఈ క్రమంలో అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం.. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి వచ్చే ముడి చమురుకు బ్రేకులు వేసింది. అమెరికాకు అండగా నిలుస్తున్నాయని పొరుగు దేశాలపై ఇరాన్ గురి పెడుతున్నది. యూఏఈ, బహ్రెయిన్, కువైట్, ఖతార్ దేశాల్లోని చమురు, గ్యాస్ ఉత్పాదక కేంద్రాలే లక్ష్యంగా దాడులు చేస్తున్నది.


# 100 జీసీసీల ఏర్పాటు లక్ష్యం...!



రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ : రాష్ట్రంలో ఈ ఏడాది 100 జీసీసీ(గ్లోబల్ కెపబిలిటీ సెంటర్)ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని, వీటి ద్వారా లక్ష మంది ఐటీ నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం రసాయనాల తయారీలో ప్రపంచంలోని అతిపెద్ద సంస్థల్లో ఒకటైన 'బాడిస్చ్ అనిలిన్ ఉండ్ సోడా ఫ్యాబ్రిక్ (బీఏఎస్ఎఫ్)' హైదరాబాద్‌లో రెండు జీసీసీల ఏర్పాటు చేసేందుకు ముందుకురాగా.. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి అంగీకార పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ కేవలం కార్యాలయాల కేంద్రంగా మాత్రమే కాకుండా.. ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ రంగాల్లో ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా కృత్రిమ మేధస్సు ఆధారిత కేంద్రం ఐకామ్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, 200 ఎకరాల్లో ఏఐసిటీ, క్వాంటమ్ హబ్, జీవ విజ్ఞాన పరిశోధనా సంస్థ '1బయోల్యాబ్'లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. బీఏఎస్ఎఫ్‌తో కొత్తగా మూడు వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ఐటీపీ ఏరో-ఇండియా' ప్లాంట్ భూమి పూజరంగారెడ్డి జిల్లా శంషాబాద్ హార్డ్ వేర్ పార్క్ (ఫేజ్-3)లో రూ.453 కోట్ల పెట్టుబడితో 10 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న 'ఐటీపీ ఏరో-ఇండియా' ప్లాంట్‌కు మంత్రి శ్రీధర్ బాబు భూమి పూజ చేశారు. ఈ ప్లాంట్ 2027 నాటికి ప్రారంభం కానున్నట్టు మంత్రి తెలిపారు. ప్రిసిషన్ ఇంజినీరింగ్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో కొత్తగా 350 మందికి ఉపాధి లభించనుంది. ఈ సంఖ్య రాబోయే రోజుల్లో 600కి పెరుగనున్నది.తెలంగాణ వార్తలుపరిశ్రమలకు ఇంజినీర్ల శిక్షణ బాధ్యతలురాష్ట్రంలో ఏటా చదువులు పూర్తి చేసుకుంటున్న 2 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టభద్రుల శిక్షణ ఇచ్చి ఉద్యోగాలకు ఈ మేరకు మంగళవారం పీఎస్ఆర్ టెక్ హబ్ సంస్థ పదేండ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. టెక్నాలజీ రంగంలో నిత్యం ఎదురయ్యే పెను సవాళ్లను అధిగమించి పదేండ్లలో రూ.120 కోట్ల సంస్థగా నిలదొక్కుకునేలా చేయడం పట్ల సంస్థ అధినేత శ్రీరంగారావును మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

# 25 నుంచి ఎస్బీఐలో ఉద్యోగుల సమ్మె




న్యూఢిల్లీ, : ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) ఉద్యోగులు సమ్మె బాటపట్టారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25 నుంచి 26 వరకు రెండు రోజుల పాటు మెరుపు సమ్మె చేస్తున్నట్టు ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్ ప్రకటించింది. పెన్షన్ ఫండ్ మేనేజర్ ఆప్షన్‌తోపాటు మరో 16 డిమాండ్లు నెరవేర్చడం లేదని యాజమాన్యంపై ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి.

# స్టార్ హెల్త్ 1,254 కోట్ల క్లెయిం సెటిల్‌మెంట్




హైదరాబాద్, : గడిచిన ఆర్థిక సంవత్సరంలో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో రూ.1,254 కోట్ల విలువైన 1.8 లక్షల పాలసీలు క్లెయిం చేశామని స్టార్ హెల్త్ ఎండీ, సీఈవో ఆనంద్ రాయ్ తెలిపారు. అంతక్రితం ఏడాది చేసిన రూ.1,014 కోట్ల కంటే ఇది 24 శాతం అధికమని పేర్కొన్నారు. కంపెనీ మొత్తం వ్యాపారంలో తెలుగు రాష్ట్రాల వాటా 10 శాతంగా ఉండగా, వచ్చే మూడు నుంచి నాలుగేండ్లలో ఇది 12 శాతం నుంచి 15 శాతానికి పెరుగనున్నదని ఆశిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా రూ.24 వేల కోట్ల ప్రీమియం వసూళ్లు లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఇప్పటికే సంస్థ 35 హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను విక్రయిస్తున్నది.

# ఈ ఆర్థిక సంవత్సరంలో 25,000 మంది ఫ్రెషర్ల నియామకం




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో 25,000 మంది ఫ్రెషర్లను నియమించుకోబోతున్నట్లు ప్రముఖ ఐటీ సేవల సంస్థ టీసీఎస్ ఎండీ, సీఈఓ కె.కృతివాసన్ వెల్లడించారు. గిరాకీ ఆధారంగా మరింత మందిని నియమించుకుంటామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో టీసీఎస్ 44,000 మంది ఫ్రెషర్లకు అవకాశం కల్పించింది. ప్రైవేటు రంగంలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగులను నియమించుకున్న సంస్థగా నిలిచింది. ఇతర కంపెనీల నుంచి ఉద్యోగులను నియమించుకునే విషయంలో కంపెనీ ఏమైనా మార్పులు చేసిందా? అని కృతివాసన్‌ను ప్రశ్నించగా.. సాధారణంగా ఒక ఫ్రెషర్‌కి శిక్షణ ఇచ్చి అతడు పూర్తి స్థాయి ఉద్యోగిగా మారడానికి 9 నెలల సమయం పడుతుందన్నారు. ఇతర కంపెనీ ఉద్యోగి అయితే వెంటనే అందుబాటులోకి వస్తారన్నారు. వ్యాపార అవసరాల ఆధారంగా నియామక వ్యూహాలు మారుతూ ఉంటాయని పేర్కొన్నారు. గడిచిన మూడేళ్లలో కనీసం 40,000 లేదా అంతకంటే ఎక్కువ మంది ఫ్రెషర్లను కంపెనీ నియమించుకుంటూ వచ్చిందని పేర్కొన్నారు. 2025-26లో 12,000 మంది ఉద్యోగులను టీసీఎస్ తొలగించింది. కంపెనీలో మెరుగైన పని తీరు కనబరిచినంత వరకు కెరీర్‌కు ఇబ్బంది ఉండదని కృతివాసన్ భరోసా ఇచ్చారు. గత ఏడాది కోతలకు, కృత్రిమ మేధ (ఏఐ) కారణమన్న వాదనలను తోసిపుచ్చారు.

# చైనాపై 50% అదనపు సుంకాలు విధిస్తాం...



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి చైనాపై బెదిరింపులకు దిగారు. ఇరాన్ నుంచి చమురు కొనుగోలు కొనసాగిస్తే చైనాపై 50% వరకు అదనపు సుంకాలు విధిస్తామని ఆయన ప్రకటించారు. ఈ చర్య ద్వారా ఇరాన్ ఆర్థిక వనరులను అడ్డుకోవడం, చైనా వాణిజ్య ఆధిపత్యాన్ని నిరోధించడం అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది. అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ చైనా ఇరాన్ నుంచి చమురును ప్రధానంగా కొనుగోలు చేస్తోంది. ఇది ఇరాన్ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటానికి సహాయపడుతున్నందున ఈ హెచ్చరిక జారీ చేయబడింది.

చైనా నుంచి వచ్చే ఉత్పత్తులపై అదనపు పన్నులు విధిస్తానని ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగితే, ఈ చర్యలను మరింత కఠినతరం చేస్తామని, 50% పన్ను విధిస్తామని ట్రంప్ అన్నారు. ఇరాన్‌తో చైనా చమురు వాణిజ్యాన్ని నిలిపివేసి, దానికి బదులుగా వెనిజులా నుంచి తక్కువ ధరకు ఇంధనాన్ని అందిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణను దుర్వినియోగం చేసి ఇరాన్ ఆయుధాలను నిల్వ చేసుకుంటోందని ట్రంప్ ఆరోపించారు. అమెరికా ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని చైనా రాయబార కార్యాలయం ఒక అధికారిక ప్రకటనలో స్పందించింది. తాము యుద్ధంలో ఏ పక్షానికీ ఆయుధాలు అందించడం లేదని కూడా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక శక్తుల మధ్య జరుగుతున్న ఈ పోరాటం ప్రపంచ మార్కెట్‌పై తీవ్ర పరిణామాలను కలిగిస్తుంది. సరఫరా గొలుసును ప్రభావితం చేయడంతో పాటు, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తుల ధరల పెరుగుదలకు కూడా దారితీయవచ్చు. ఇరాన్‌ను ఆర్థికంగా ఏకాకిని చేయాలన్న అమెరికా ప్రయత్నాలకు చైనా సహకారం ఒక అడ్డంకిగా ఉంది. ఈ పరిస్థితుల్లో, వాణిజ్య సుంకాలను పెంచడం ద్వారా ట్రంప్ చైనాపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ట్రంప్ చర్యలు కొత్త వాణిజ్య యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# ఫ్రీ క్యాన్సర్ వ్యాక్సిన్





మాస్కో : క్యాన్సర్.. ప్రస్తుతం సమాజంలో వేగంగా విస్తరిస్తున్న వ్యాధుల్లో ఇదీ ఒకటి. మారుతున్న జీవనశైలి.. ఆహారపు అలవాట్లు, వాతావరణ పరిస్థితుల కారణంగా స్త్రీపురుష బేధం లేకుండా.. వయసుతో సంబంధం లేకుండా.. క్యాన్సర్ విస్తరిస్తోంది. ఇప్పటి వరకు చికిత్స తప్ప నివారణ లేని వ్యాధి. అయితే దీనికి రష్యా శుభవార్త చెప్పింది. క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్ అభివృద్ధి చేసినట్లు అధికారికంగా ప్రకటించింది. త్వరలో ప్రపంచవ్యాప్తంగా ఉచితంగా అందిస్తామని కూడా తెలిపింది. ఈ ఆవిష్కరణ ఆరోగ్య రంగంలో భారీ మలుపును తీసుకురావచ్చు.ఈ వ్యాక్సిన్ ఎఖీఔం సాంకేతికతపై ఆధారపడి రూపొందించబడింది, ఇది శరీరంలో క్యాన్సర్ కణాలను గుర్తించి నశింపజేసే రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. మెలనోమా, లంగ్ క్యాన్సర్, ప్యాన్క్రియాస్ వంటి ఆరు ముఖ్య రకాలపై ప్రధానంగా పనిచేస్తుంది. రష్యా గమాలేయా జాతీయ ఎపిడెమాలజీ ? మైక్రోబయాలజీ రీసెర్చ్ సెంటర్‌లో అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్‌కు 'ఫ్యూచర్?వీ' అనే పేరు ప్రతిపాదించారు.మొదటి, రెండవ దశ ట్రయల్స్‌లో 100 మంది పైగా రోగులపై పరీక్షలు విజయవంతమయ్యాయి. ట్యూమర్ పరిమాణం 30?50% తగ్గడం, రోగ నిరోధకత పెరగడం గమనించారు. మూడవ దశ 2026లో ప్రారంభం కానుంది, ఇందుకు డబ్ల్యూహెచ్‌వో, ఈఎంఏ ఆమోదాలు కోరుతున్నారు.2026 చివరి నుంచి ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాక్సిన్ ఉచితంగా అందజేయనున్నారు. రష్యా ప్రభుత్వం, గమాలేయా సెంటర్, అంతర్జాతీయ సంస్థల సహకారంతో 10 కోట్ల డోసులు ఉత్పత్తి చేయబడతాయి. దిగువ ఆదాయ వర్గాలు, అభివృద్ధి చెడుతున్న దేశాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపింది. భారత్, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలతో ఒప్పందాలు కుదిరినట్లు వెల్లడించింది. మరోవైపు ప్రపంచ ఆరోగ్య సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి, కానీ పూర్తి డేటా ప్రచురణకు ఆందోళన వ్యక్తం చేశాయి. పేటెంట్ హక్కులు, ఉత్పత్తి సామర్థ్యం ప్రధాన సవాళ్లు. విజయం సాధిస్తే, క్యాన్సర్ మరణాలు 40% తగ్గవచ్చని నిపుణులు అంచనా.ఈ వ్యాక్సిన్ విస్తరణతో క్యాన్సర్ చికిత్స ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. పర్సనలైజ్డ్ మెడిసిన్‌కు మార్గం సుగమం అవుతుంది. మరిన్ని ట్రయల్స్ జరిగిన తర్వాత పూర్తి అమలు సాధ్యమవుతుంది.

# ఆగని పైరసీ..!




హైదరాబాద్: ఐబొమ్మ రవిపై పోలీసులు 4 రకాల కేసులు నమోదు చేశారు. ఇప్పటికే అతన్ని రెండుసార్లు కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించారు. అది ఏమాత్రం చాలలేదని చెబుతూ.. మళ్లీ కస్టడీ కోరారు. దాంతో కోర్టు.. 4 కేసుల్లోనూ కస్టడీకి అనుమతించింది. ఒక్కో కేసుకూ 3 రోజుల చొప్పున.. 12 రోజులు కస్టడీకి అనుమతించింది. అందువల్ల పోలీసులు గురువారం నుంచి మళ్లీ రవిని కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించడం మొదలుపెడతారు. ఇదంతా ఓకే.. కానీ అసలు సమస్య సాల్వ్ అవ్వలేదు.రవి అరెస్టు తర్వాత పైరసీ ఎక్కడా ఆగలేదు. కొత్తగా రిలీజ్ అవుతున్న అన్ని సినిమాలూ ఎప్పట్లాగే పైరసీఅవుతున్నాయి. ఒక్క సినిమా కూడా పైరసీ అవ్వకుండా ఆగింది లేదు.మరి రవిని అరెస్టు చేసి పోలీసులు సాధించింది ఏంటి? అనే ప్రశ్న వస్తోంది. అసలు పైరసీ ఎందుకు ఆగట్లేదు అనేది మనం లోతుగా ఆలోచించాల్సిన విషయం. ఎందుకు అంటే.. రవి.. ఏ కొత్త సినిమానూ డైరెక్టుగా పైరసీ చెయ్యలేదు. అంటే.. థియేటర్‌కి వెళ్లి.. రహస్యంగా వీడియో రికార్డులు చెయ్యడం వంటివి రవి చెయ్యలేదు. అతను ఇతర పైరసీ సైట్ల నుంచి పైరసీ సినిమాల్ని తీసుకొని.. ఐబొమ్మ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. అందువల్ల అసలు పైరసీ సైట్లు అలాగే ఉన్నాయి. వాటిని పోలీసులు బ్రేక్ చెయ్యలేకపోతున్నారు. రవి దొరకగానే.. అతనే పైరసీ కింగ్ అని చెప్పారు. కానీ.. అతను పైరసీ మాఫియాలో చిన్న పార్ట్ మాత్రమే.మనకు ఇంకో డౌట్ రావచ్చు. ఓటీటీలో సినిమాల్ని అతను పైరసీ చేసేవాడు కదా. ఇక ఇప్పుడు ఆ పైరసీ ఆగిపోయినట్లే కదా అని. అంత లేదు. ఆ పైరసీ కూడా ఆగలేదు. రవి ఏం చేసేవాడంటే.. ఆఖీఓ టెక్నాలజీని వాడేవాడు. దీని ద్వారా ఓటీటీ సినిమాలను ప్లే చేస్తూ.. స్క్రీన్ రికార్డ్ చేసేవాడు. అదే సమయంలో.. ఆడియో కూడా రికార్డ్ అయ్యేది. అలా రికార్డ్ అయిన సినిమాల్ని ఐబొమ్మ, బొప్పం వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేశాడు. రవి అరెస్టు అయిన తర్వాత కూడా ఓటీటీ సినిమాలు పైరసీ అవుతూనే ఉన్నాయి. చాలా మంది ఆఖీఓని వాడి.. పైరసీ చేస్తున్నారు. అంటే.. రవి అనే వ్యక్తి.. ఈ పైరసీ మాఫియాలో కింగ్ కాదు. అతని అరెస్టుతో పోలీసులు సాధించేది ఏమీ లేదని తేలిపోతోంది.

# విద్వేషం.. హింస



స్ట్రేలియాలోని సిడ్నీ అత్యంత పాశవిక మారణకాండకు వేదికగా మారడం దిగ్భ్రాంతికరం. యూదులే లక్ష్యంగా తండ్రీ కొడుకులు తుపాకీ గుళ్ల వర్షం కురిపించడంతో పదేళ్ల బాలిక సహా 16 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 40 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా 'హనూకా' వేడుక చేసుకునేందుకు సిడ్నీలోని బొండీ బీచ్‌లో కొవ్వొత్తులు వెలిగించడానికి వచ్చిన చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ దుండగుల కాల్పుల్లో రక్తమోడడం అత్యంత బాధాకరం. మతపరమైన ద్వేషం, జాత్యహంకారం, విద్వేష ఉపన్యాసాలు, మీడియా, సోషల్ మీడియాలో విస్తరిస్తున్న ఉన్మాద భావనలు.. ఇవన్నీ ఇలాంటి దుర్మార్గాలకు ఆజ్యం పోస్తున్నాయి.

విద్వేషం మరింత విద్వేషాన్ని పెంచుతుందే కానీ..శాంతినీ, సామరస్యాన్నీ కలిగించదని గౌతమ బుద్ధుడు దగ్గర నుంచి అన్ని మతాల ప్రవక్తలు ప్రకటిస్తున్నదే! యూదులపై ద్వేషభావం ఆస్ట్రేలియా సమాజాన్ని కలుషితం చేస్తోందని, అక్కడి ప్రభుత్వ విధానాలు ఆ అగ్నికి ఆజ్యం పోస్తున్నాయంటూఈ ఘటన జరిగిన వెంటనే ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ ఊగిపోయారు. చిన్నారులు, మహిళలు అన్న కనికరంగానీ, ఆకలి తీర్చుకునేందుకు క్యూలో నిలబడ్డారన్న ఇంగితం కానీ, ఆసుపత్రిలో కొన ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారన్న జ్ఞానం కానీ లేకుండా అమానుషంగా 70 వేల మందికిపైగా అమాయకులను ఊచకోత కోసిన నెతన్యాహు సర్కారు, దానికి అండదండలిచ్చిన అమెరికా లాంటి పశ్చిమ దేశాలే ఇలాంటి మారణ హోమాలకు సంజాయిషీ చెప్పాలి.

పాలస్తీనాపై నరమేధం తర్వాత ఆస్ట్రేలియాలో యూదు వ్యతిరేక ఘటనలు 316 శాతం పెరగడం, రెండు వేల కంటే ఎక్కువ కేసులు నమోదవడమే ఇందుకు సాక్ష్యం. ప్రాణాలకు తెగించి ఓ దుండగుడి చేతిలోని తుపాకీ లాక్కుని అనేకమంది ప్రాణాలను కాపాడిన అహ్మద్ అల్ అహ్మద్‌కు ప్రపంచమంతా సెల్యూట్ చేస్తోంది. పహల్గాం ఉగ్రదాడి సందర్భంలో టూరిస్టులను కాపాడి, ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా అందరికీ గుర్తొస్తాడు. ఒకరికి ఒకరు వెలుగుగా ఉండాలని, ఐక్యంగా ఉండాలని ఆస్ట్రేలియా ప్రధాని పిలుపునివ్వడం, అహ్మద్‌ను ఆసుపత్రిలో కలిసి అభినందించడం మంచి పరిణామం. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరగడంతో తుపాకీ నియంత్రణ చట్టాలను ఆస్ట్రేలియా అమలు చేస్తోంది. వాటికి మరింత పదును పెట్టడం, దోషులను కఠినంగా శిక్షించడం, సమాజంలో సోదర భావాన్ని పెంపొందించడం అత్యవసరం.

ఒక ఘటన జరగ్గానే ఆ మతానికి చెందిన ప్రతి ఒక్కరినీ ద్వేషంతో చూడటం మొదలు పెడితే సమాజం విడిపోతుంది. మెజారిటీ, మైనారిటీ మతోన్మాదులు కోరుకునేది ఇదే. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌తోపాటు సంఘ్ పరివార్‌లోని విహెచ్‌పి, బజరంగ్‌దళ్ లాంటి సంస్థలు రెచ్చిపోతున్నాయి. మైనారిటీలంతా శత్రువులు, జీహాదీలని, వారిపై దాడులు చేయడం ధర్మ రక్షణ అని, మసీదులు, చర్చిలపై దాడులు చేయడం హీరోయిజం అని యువతను పక్కదోవ పట్టించడం, అందు కోసం అలవోకగా అబద్ధాలను ప్రచారం చేయడం అత్యంత ప్రమాదకరం. గోడీ మీడియాతోపాటు సోషల్ మీడియా కూడా అందుకు ఇతోధికంగా సహకరించడం తగదు.

అమెరికా, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో మైనారిటీగా వున్న హిందువులపై దాడులు జరిగినప్పుడు విహెచ్‌పి లాంటి సంస్థలు మొసలి కన్నీరు కారుస్తున్నాయి. విద్వేషం ఏ దేశంలోనైనా మైనారిటీలకు ముప్పుగా పరిగణిస్తుందనేది జగమెరిగిన సత్యం. జాత్యహంకారం, విద్వేషాన్ని పెంచి పోషిస్తే.. అది తిరిగి వారినే కాటేస్తుందనడానికి పక్కనే ఉన్న పాకిస్తాన్ లాంటి దేశాల్లో నిత్యం సాగుతున్న ఉగ్రవాద ఘటనలే ఉదాహరణ. భిన్నత్వం లో ఏకత్వాన్ని, లౌకికవాదాన్ని, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వా న్ని, రాజ్యాంగ విలువలను రక్షించుకోవడమే భారతీయత. సమాజంలో, రాజకీయాల్లో పెరుగుతున్న ద్వేషాన్ని తిప్పికొట్టడంతోపాటు అహ్మద్‌లాతోటివారి కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడే స్ఫూర్తిని మనసు నిండా నింపుకోవడం తక్షణ కర్తవ్యం. విద్వేషాన్ని విడనాడి మానవత్వమే మతమని, అభిమతమని, అత్యున్నతమని ప్రతి ఒక్కరూ ప్రతిన బూనడమే ఇలాంటి మారణహోమాలకు విరుగుడు.

## డిజైనింగ్ లోపాలతో నిండుతున్న రైల్వే అండర్ బ్రిడ్జిలు

### -శాశ్వత పరిష్కారం కోరిన ఎంపీ గురుమూర్తి

తిరుపతి :తిరుపతి పార్లమెంట్ పరిధిలోని రైల్వే అండర్ బ్రిడ్జల వద్ద వర్షాకాలంలో తలెత్తుతున్న సమస్యల గూర్చి తిరుపతి ఎంపీ గురుమూర్తి పార్లమెంటులో ప్రస్తావించారు. చిన్నపాటి వర్షాలకే కొన్ని అండర్ బ్రిడ్జల వద్ద నీరు నిలవడంతో ప్రయాణికులకు అసౌకర్యంగా మారడం తోపాటు ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి దృష్టికి తీసుకెళ్లారు.ఈ ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ సమాదనం ఇచ్చారు. దేశవ్యాప్తంగా రైల్వే అండర్ బ్రిడ్జిలు, సబ్‌వేలలో నీరు నిలిచిపోకుండా డ్రైనేజ్ వ్యవస్థలు, నీటి మళ్లింపు మార్గాలు, క్రాస్ డ్రైన్లు, జాయింట్ సీలింగ్, ఎంట్రీ వద్ద హంప్‌లు, కవర్ల షెడ్‌లు, అత్యవసర పంపింగ్ ఏర్పాట్లు వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే అసాధారణ వర్షపాతం సమయం లో ట్రాఫిక్ నిలిపివేయడం, హెచ్చరిక బోర్డులు, గేటు బారియర్లు, వాచ్‌మన్‌ల నియామకం వంటి భద్రతా చర్యలు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు.తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి, మొత్తం 43 రైల్వే అండర్ బ్రిడ్జిలు ఉన్నాయని, గత వర్షాకాలంలో గూడూరు, రేణిగుంట సెక్షన్ లో చెర్లోపల్లి, కాపుగున్నేరి, రాచగున్నేరి లోని మూడు అండర్ బ్రిడ్జల వద్ద నీరు నిలిచి సమస్య వచ్చిందని, దానిని పంపింగ్ ద్వారా పరిష్కరించినట్లు సమాధానంలో పేర్కొన్నారు. అలాగే తిరుపతి నియోజకవర్గంలో రూ.208 కోట్ల వ్యయంతో 6 చోట్ల రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జిలు నిర్మించేందుకు అనుమతులు ఇచ్చినట్లు తెలియజేశారు. మొత్తంగా సమస్య ఉందని ప్రభుత్వం గుర్తించిందని, తాత్కాలిక చర్యలతో పాటు శాశ్వత పరిష్కా రాల దిశగా పనులు జరుగుతున్నా యని మంత్రి తన సమాదనంలో తెలియజేశారు. అయితే డిజైన్ లోపాలపై ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు నిర్ణయించినట్లు స్పష్టమైన వివరాలు ఇవ్వలేదు. స్థానిక మున్సిపల్ సంస్థలతో సమన్వయంతో సమగ్ర డ్రైనేజ్ పరిష్కా రాలపైపని చేస్తున్నామని మాత్రమే తెలిపారు. ఈ అంశంపై ఎంపీ గురుమూర్తి స్పందిస్తూ రైల్వే అండర్ బ్రిడ్జలలో వర్షాకాలం నీరు నిలవడం ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.చిన్నపాటి వర్షం పడినా కూడా కొన్ని అండర్ బ్రిడ్జిలు నీటితో నిండిపోవడం చూస్తుంటే స్పష్టమైన డిజైన్ లోపాలు, సమగ్ర డ్రైనేజ్ ప్రణాళిక లేకపోవడాన్ని సూచిస్తుందని ఆయన పేర్కొన్నారు. తాత్కాలిక పంపింగ్ ఏర్పాట్లకే పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారాలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న అండర్ బ్రిడ్జిలలో సరైన డ్రైనేజ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఉన్న అండర్ బ్రిడ్జిలలో డిజైన్ ఆడిట్ నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ చర్యలు తీసుకోవాలని ఎంపీ గురుమూర్తి కోరారు.

# అక్కరకు కాని సంక్షేమ పథకాలు?

మెదక్, : రెండు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లను హస్తగతం చేసుకున్నామని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు పైకి చెబుతున్నా, అంతర్గతంగా మాత్రం ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ పోరులో బీఆర్ఎస్ గ్రాఫ్ అనూహ్యంగా పెరగడం, రెండు వేలకు పైగా సర్పంచ్ స్థానాలు గెలుచుకోవడంతో కాంగ్రెస్ నాయకుల్లో అంతర్మథనం మొదలైంది. అనుకున్న లక్ష్యానికి ఎందుకు చేరుకోలేపోయామనే అంశంపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించిందిడీసీసీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, క్షేత్రస్థాయిలోకి వెళ్లి సీరియస్‌గా పనిచేయలేదని.. అసంతృప్తులను, అసమ్మతిని బుజ్జగించి దారిలోకి తీసుకురావడంలో డీసీసీ అధ్యక్షులతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ ఇన్‌చార్జ్‌లు, మండల పార్టీనాయకులువిఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెబల్స్‌ను బుజ్జగించి.. పోటీ నుంచి తప్పించకుండా వదిలేయడం వల్లే పంచాయతీ పోరులో అనుకున్న లక్ష్యం సాధించలేకపోయామనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఈ పరిస్థితి వల్లే ఓట్లు బాగా చీలి బీఆర్ఎస్, బీజేపీ లాభపడ్డాయి అని అంటున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించడంలోనూ వెనకబడిపోయినట్లుగా కాంగ్రెస్ నేతలు గుర్తించినట్లుగా గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. అయితే 70 నుంచి 80 శాతం వరకు సర్పంచ్‌లను గెలుచుకుంటామని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చెబుతున్న విషయం తెలిసిందేకానీ, రెండు విడతల్లో 8,555 గ్రామాల్లో ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ పార్టీ 4,579 పంచాయతీల్లో మాత్రమే విజయం సాధించింది. ఇక బీఆర్ఎస్ 2,3 57, బీజేపీ 457, ఇతరులు 1,162 సర్పంచ్ స్థానాల్లో గెలుపొందారు. రెండు విడతల్లో వచ్చిన ఫలితాలు మూడో విడతలో పునరావృతం కాకుండా జగ్రత్తపడాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రతి నాయకు డు అప్రమత్తంగా ఉండాలని గాంధీభవన్ నుంచి డీసీసీ అధ్యక్షులు, స్థానిక నాయకులకు ఆదేశాలు వెళ్లినట్లుగా తెలిసింది. ఇదే పరిస్థితి కొనసాగితే, త్వరలోనే పార్టీపరంగా జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్, కార్పోరేషన్ల ఎన్నికల్లో నష్టం జరుగుతుందని పార్టీ పెద్దలు హెచ్చరిక కూడా చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ వెయ్యిలోపే సర్పంచ్‌లు గెలుస్తుందని కాంగ్రెస్ నేతలు మొదటి నుం చి భావించారు. కానీ, ఫలితాలు చూస్తే ఆశ్చర్యపడాల్సిన పరిస్థితి వచ్చిందని వారు చెబు తున్నారు. చాలా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు గట్టిపోటీ ఇచ్చారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థుల తరపున మంత్రులు, కొందరు ఎమ్మెల్యేలతో పాటు డీసీసీ నాయకుల్లో కొందరు పనిచేసినా.. మరికొందరు పెద్దగా దృష్టి సారించలేదని, అందుకే సగంస్థానాలకే పరిమితం కావాల్సి వచ్చిందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ లాంటి సంక్షేమ పథకాలు అందజేస్తున్నా ఫలితాలు ఆశించిన మేర ఫలితాలు రాలేదనే చర్చ జరు గుతోంది. మరోవైపు బీఆర్ఎస్ స్థానిక క్యాడ ర్ పంచాయతీ ఎన్నికలను సవాల్‌గా తీసుకుని.. కాంగ్రెస్‌కు ధీటుగా పనిచేసి 2 వేలకు పైగా సర్పంచ్‌లను గెలిపించుకున్నారని చర్చ జరుగుతోంది బీజేపీకూడా ఊహించని విధంగా ఫలితాలను సాధించుకుంది. రెండు విడతలు కలిపి 457పంచాయతీలు గెలవడంపై ఆపార్టీ రాష్ట్ర నాయకత్వమే ఆశ్చర్యం వ్యక్తం చేస్తోంది.

# హైదరాబాద్ జూకు కంగారూలు, జీబ్రాలు



హైదరాబాద్, : నెహ్రూ జూలాజికల్ పార్క్‌ను సందర్శించే పిల్లలు, కుటుంబాలు, వన్యప్రాణి ప్రేమికులు త్వరలో మొదటిసారిగా కంగారూలను చూడబోతున్నారు. జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా ఈ ఆస్ట్రేలియా జాతి జంతువులను తీసుకురావడానికి హైదరాబాద్ జూ సిద్ధమవుతోంది.గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో రిలయన్స్ ఫౌండేషన్ నడుపుతున్న అంతర్జాతీయ వన్యప్రాణుల రక్షణ, పరిరక్షణ కేంద్రమైన వంతారా నుండి ఒక జత కంగారూలను తీసుకురానున్నారు. వాటి కోసం ఎన్‌క్లోజర్లు, రాత్రిపూట నివాస గృహాలను ఇప్పటికే సిద్ధం చేసినట్లు జూ అధికారులు తెలిపారు. వంతారా డైరెక్టర్ బ్రిజ్ కిషోర్ గుప్తా నేతృత్వంలోని ఒక బృందం ఇటీవల హైదరాబాద్ జూలోని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను తనిఖీ చేసింది.'జూలో కంగారూలు ఉండటం ఇది మొదటిసారి. మేం త్వరలో వంతారా నుండి ఒక మగ, ఒక ఆడ కంగారూను తీసుకుంటాం. అవి వచ్చిన తర్వాత, వాటిని ప్రదర్శనకు ఉంచే ముందు కొన్ని రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచుతాం.' అని నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు చెందిన ఒక సీనియర్ అధికారి తెలిపారు.ఇప్పుడు వంతారా నుంచి వచ్చే కంగారూలకు బదులుగా హైదరాబాద్ జూ నుంచి ఏనుగులలోని ఒకదానిని వంతారాకు పంపనుంది. గతంలో 2020లో జపాన్‌లోని యోకోహామా జూలాజికల్ గార్డెన్స్ నుండి నాలుగు కంగారూలను తీసుకురావాలని హైదరాబాద్ జూ ప్రణాళిక వేసింది. కానీ కొవిడ్-19 మహమ్మారి కారణంగా ఏర్పడిన అంతరాయాల వల్ల ఆ ఒప్పందాన్ని నిలిపివేశారు.ఇదిలా ఉండగా ప్రస్తుతం జూలో ఒంటరిగా ఉన్న సన్నీ అనే మగ జిరాఫీకి త్వరలో ఒక ఆడ తోడు రానుంది. సీనియర్ అధికారులు ఇటీవల మైసూరు జూను సందర్శించి ఈ మార్పిడిని ఖరారు చేశారు. ఈ నెలాఖరులోగా జిరాఫీ వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జూలో 2,200 కంటే ఎక్కువ జంతువులు, పక్షులతో పాటు 199 జాతుల జీవులు ఉన్నాయి.త్వరలో జీబ్రాలు కూడా ఇక్కడ మరింత సందడిగా చేయనున్నాయి. జూ త్వరలో వంతారా నుండి ఒక జత జీబ్రాలను తీసుకురానుంది. ఇప్పటికే ఆ కేంద్రం నుండి తీసుకువచ్చిన రెండు మగ, ఒక ఆడ జీబ్రాలతో కలిపి వీటి సంఖ్య పెరుగుతుంది. 37 ఏళ్ల విరామం తర్వాత హైదరాబాద్ జూకు జీబ్రాలు తిరిగి వచ్చాయి.

# ఏఐతో భవిష్యత్తు..!

నలభై ఆరేళ్ల క్రితం అంటే 1980లో దేశంలో కంప్యూటరీకరణను విస్తరింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా ఆందోళనలు తలెత్తాయి. 1984 సంవత్సరాన్ని 'యాంటీ కంప్యూటరైజేషన్ సంవత్సరం'గా పరిగణించారు. దీంతో తమ ఉద్యోగాలు పోతాయని, ఆర్థికంగా దెబ్బతింటాయని, దేశంలో తీవ్ర పరిస్థితులు తలెత్తుతాయని కార్మికులు నిరసన ప్రదర్శనలు సాగించారు. అయితే రానురాను డిజిటల్ టెక్నాలజీని అమలు లోకి విస్తారంగా తీసుకు రావడంతో సమాజంలోని అన్ని వర్గాల్లో, దేశం మొత్తం మీద ఆలోచనల్లో మార్పురావడం ప్రారంభమైంది. కంప్యూటర్లు, ఆధునిక సాంకేతికత భారీగా ఉద్యోగాలు కల్పిస్తాయని, జీవితంలో అనేక విధాలుగా ఉపయోగపడతాయని నమ్మకం పెరిగింది. ఎఐ (కృత్రిమ మేధ) ఆధునిక ప్రపంచంలో కీలకమైన కేంద్రంగా వర్ధిల్లుతోంది. ఇప్పుడు ఎక్కడ విన్నా ఎఐ గురించే చర్చ వినిపిస్తోంది. మానవ చరిత్రలో ఇప్పటివరకు ఎన్నో పెద్దమార్పులు వచ్చాయి. కానీ ఇప్పుడు ఎఐ అన్నది అత్యంత శక్తివంతమైన, అతి గొప్ప ఆవిష్కరణల్లో ఒకటిగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ సాంకేతిక నాయకత్వంలో భారత్ అగ్రస్థానం సాధించాలన్న లక్ష్యంతో ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్' ప్రారంభం కావడం చెప్పుకోదగిన ఘట్టం. ఎఐ యుగం నియమాలు, ప్రమాణాలు, అవకాశాలను రూపొందించడంలో మనదేశం కీలకంగా ఉండాలనే ప్రధాన లక్ష్యంతో ఏర్పాటైన ఈ సదస్సు గురించి ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తివంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందని వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే దేశంలో ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పరిపాలన, వంటి అనేక రంగాల్లో ఎఐ కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు 22 రంగాల్లోని 17 రంగాల కంపెనీలు తమను తాము ఎఐ సాంతికత దిశగా మార్చుకోవలసిన ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఎఐతో ఎక్కువ అనుబంధం ఉన్న ఐటి వంటి రంగాల్లో పెద్ద మార్పులు వస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ ఎఐ సిఇఒ ముస్తఫా సులేమాన్ వచ్చే 18 నెలల్లో కంప్యూటర్ ఉద్యోగాలన్నీ ఎఐతో భర్తీ అవుతాయని అంచనా వేశారు. ఎఐ వల్ల 2035 నాటికి ప్రపంచ జిడిపి (స్థూల దేశీయోత్పత్తి) లో 15 శాతం పాయింట్లు పెరగవచ్చని ఏడాది క్రితం ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ అనే సంస్థ అంచనా వేసింది. అంటే ప్రతి సంవత్సరం సుమారు 1 శాతం అదనపు అభివృద్ధి తథ్యమన్న అంచనాలు వెలువడ్డాయి. ఈ సదస్సు ఒక బలీయమైన జాతీయ ఎఐ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి మాత్రమే ప్రయత్నించకుండా ప్రపంచ దక్షిణార్థ దేశాలను కూడా ఇందులో భాగస్వాములను చేయాలన్న తపన కనిపిస్తోంది. ఆయా దేశాలు కృత్రిమ మేధపై తమ ప్రణాళికలను ఈ వేదికపై వెల్లడించే అవకాశం కనిపిస్తోంది. అయితే ఎఐ ప్రణాళికలకు సంబంధించి భారత్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. ఈ సాంకేతికతకు కావలసిన కనీస సెమీ కండక్టర్లు లేదా కంప్యూటర్ చిప్‌లు తయారు చేసే సామర్థ్యం ఇంకా భారత్‌కు అలవడ లేదు. ప్రస్తుతం దేశంలో ఎఐ సంపూర్ణ సామర్థంతో ఏ కంపెనీ లేదు. అలాగేమెగా డేటా సెంటర్లు లేవు. పాత్రధారులు, నాటకం స్క్రిప్టు, కనీసం వేదిక లేకుండా ఏదైనా నాటకం ఎలా ప్రదర్శించలేరో అలాగే క్షేత్రస్థాయిలో కనీస మౌలిక అవసరాలులేకుండా ఎఐ సాంకేతికతను సాధించడం కష్టతరమే. అయినప్పటికీ ఎఐకి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ గత కొన్నేళ్లుగా ఏర్పడిచిగుళ్లు మొలకెత్తడం ప్రారంభమైంది. రెండేళ్లుగా సెమీ కండక్టర్ల తయారీ అత్యంత నాటకీయంగా ఆవిర్భావమైంది. ఈ ఏడాది జనవరి నాటికి దేశం లోని ఆరు రాష్ట్రాల్లో 10 సెమీ కండక్టర్ తయారీ ప్రాజెక్టులు వచ్చాయని, వీటిలో కొన్ని ఆన్‌లైన్‌లో ఉన్నాయని ప్రభుత్వం అంచనాగా చెబుతోంది. ఇక రెండో అంశం..దేశంలో మెగా డేటా సెంటర్ల ఏర్పాటును ప్రోత్సహించడం గత ఏడాది గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, డిజిటల్ కనెక్షన్, తదితర ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థలు 2030 వరకు ఎఐ, క్లౌడ్ మౌలిక సదుపాయాల్లో దాదాపు 68 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టడానికి నిర్ణయం తీసుకున్నాయి.

ఈ మేరకు చిప్ డిజైన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ పర్యావరణం నెలకొల్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే చెప్పవచ్చు. జెన్‌సెన్ హుయాంగ్, గూగుల్ సిఇఒ సుందర్‌పి చాయ్, తదితరులు భావితరానికి ఎఐ సాంకేతిక కేంద్రంగా భారత్ వర్ధిల్లు తుందని, ఎఐని భారత్ ముందుకు తీసుకెళ్తుందని అభిప్రాయాలతో దృఢమైన విశ్వాసం వెలిబుచ్చడం గమనార్హం. భారత్‌లో మానవ వనరులకు లోటు లేదని, ఎఐ అమలు స్థాయి మరింత ముందుకు వెళ్తుందని చెబుతున్నారు. ఇప్పటికే ఎఐ ఫ్రంట్రన్నర్ చాట్ జిపిటిలో ప్రపంచం మొత్తం మీద రెండో భారీ మార్కెట్‌గా భారత్ ఉంటోందని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సామ్ ఆల్ట్‌మాన్ అంగీకరించారు. ఎఐ నమ్మదగిన ముఖ్యమైన మార్కెట్‌గా అభివర్ణించారు. ఇవన్నీ ఎఐ సంస్థలకు భారత్ ఆకర్షణీయ కేంద్రంగా మారుస్తున్నాయి. ఏఐ వల్ల పలు ఉద్యోగాలకు పోతాయని ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రముఖ బిలియనీర్, పారిశ్రామిక వేత్త వినోద్ ఖోస్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐ టూల్స్ రాబోయే ఐదేళ్లలో ఐటీ సేవలు, బీపీఓ ఉద్యోగాలు దాదాపు కనమరుగవుతాయని అంచనా వేశారు.



# యువనేతలకు పోటీ చేసేదెక్కడ..!

నెల్లూరు: వైసీపీ 20 నెలలుగా అధికారం కోల్పోయామనే బాధ వెంటాడుతూనే ఉంది. మళ్లీ పవర్‌లోకి వస్తామా? ఫీల్డ్‌లోకి దిగి పనిచేస్తే పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయో? లేదో? అనే డైలమా కంటిన్యూ అవుతోంది. ఓవైపు వైసీపీ లీడర్లు..క్యాడర్..డైలమాలో ఉంటే..కొన్ని చోట్ల టికెట్ ఫైట్ నడుస్తుంది. మరికొన్ని చోట్ల నడిపించే నాయకుడు లేక క్యాడర్ అయోమయంలో పడిపోయిందట. ఇక కొందరు ముఖ్యనేతల పరిస్థితి ఇంకా గమ్మత్తుగా ఉందట. పేరు గొప్పగా ఉన్నా చెప్పుకోవడానికి తమకంటూ ఓ నియోజకవర్గం లేకుండా పోయిందని మధన పడుతున్నారట.వైసీపీకి చెందిన పలువురు యువనేతలు అయితే అధినేత నిర్ణయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారట. గత ఎన్నికల్లో ఎక్కడ పోటీ చేయాలని ఆదేశిస్తే అక్కడ పోటీ చేశాం. అప్పుడు అధికారం ఉంది గెలుస్తామనే ధీమా ఉండేది. ఇప్పుడు అపోజిషన్‌లో ఉన్నామ్. అసలే పరిస్థితులు బాలేవు. పైగా ప్రతిపక్షంలోకి వచ్చి 20 నెలలు గడిచిపోయింది. ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైమ్ ఉన్నా జమిలి ఎలక్షన్స్ వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే త్వరగా ఏదో ఒక నియోజకవర్గానికి ఇంచార్జ్‌గా నియమిస్తే వెళ్లి అక్కడ పనిచేసుకుంటామంటూ అర్జీలు పెట్టుకుంటున్నారు పలువురు ఫ్యాన్ పార్టీ లీడర్లు. అప్పటిలోగా రాజకీయంగా అడుగు తీసి అడుగు వేయాలంటే ఆలోచించే పరిస్థితిని ఫేస్ చేస్తున్నారట. తమకంటూ ఓ నియోజకవర్గం లేకుండా పోయిందన్న భావనలో ఉన్నారటవిజయవాడ తూర్పు నియోజకవర్గంలో దేవినేని అవినాష్ యువ నాయకుడిగా దూకుడు ప్రదర్శిస్తున్నారు. కూటమిపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ..బలమైన కౌంటర్ ఇస్తూ నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారు. పైగా కమ్మ సామాజికవర్గంలో అంతో ఇంతో మద్దతున్న నేత. కానీ వచ్చే ఎన్నికల్లో ఆయన ఎక్కడి నుంచే పోటీ చేస్తారు? అంటే..ఇప్పటికైతే నో క్లారిటీ. దీంతో ఆయన ఎటువైపు అడుగు వేయాలన్నది తేల్చుకోలేకపోతున్నారట. విజయవాడ ఎంపీగా పోటీ చేయాలని కొంతసేపు..కాదు పెనమలూరు నియోజకవర్గం ఇస్తామని మరోసారి..మచిలీపట్నం నుంచి పోటీ చేయించే యోచన అంటూ ఇంకోసారి లీకులు ఇస్తుండటంతో దేవినేని అవినాష్ సందిగ్ధంలో పడ్డారట.ఇక విజయవాడ పశ్చిమలో పోతిన వెంకట మహేష్, వెల్లంపల్లి శ్రీనివాస్ ఇద్దరిలో ఎవరికి టికెట్ ఇస్తారో తెలియని పరిస్థితి. అటు నెల్లూరు సిటీ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అయితే సైలెంట్ మోడ్‌లో ఉన్నారు. గత ఎన్నికల్లో ఆయనను నరసరావుపేట ఎంపీగా పోటీ చేయించారు. కానీ ఆయన అక్కడ ఓడిపోయారు.

దీంతో మళ్లీ తిరిగి తన సొంత నియోజకవర్గానికి వెళ్లాలనుకుంటున్నారు.కానీ అక్కడ గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన అడాల ప్రభాకర్‌రెడ్డి మళ్లీ టికెట్ ఆశించే అవకాశం ఉందంటున్నారు. దీంతో తిరిగి సొంత సెగ్మెంట్ నుంచి పోటీ చేయడంపై అనిల్‌కుమార్ యాదవ్‌కు అధిష్టానం నుంచి అభయం దక్కలేదంటున్నారు. అటు గుడివాడ అమర్‌నాథ్ తనను గాజువాక ఇంచార్జ్‌గా నియమించడంపై అసంతృప్తిగా ఉన్నారట.ఇలా గత ఎన్నికల్లో నియోజకవర్గాలు మార్చి అధిష్టానం మరో చోటు నుంచి పోటీ చేయించిన నేతలంతా పొలిటికల్ ఫ్యూచర్‌పై డైలమాలో ఉన్నారట. వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయాలనే దానిపై క్లారిటీ లేకపోవడంతో లైమ్‌లైట్‌లో ఉండేందుకు ఇష్టపడట్లేదట. ఏదో ఒక నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఇప్పటినుంచే పని చేసుకుం టూపోతేనే పట్టు సాధించే అవకాశం ఉంటుందని..లేకపోతే గత ఎన్నికల లాగా లాస్ట్ మూమెంట్‌లో నియోజకవర్గాలు మారిస్తే కష్టమే అంటున్నారు ఫ్యాన్ పార్టీ లీడర్లు. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది నేతలు జగన్ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారట. నియోజకవర్గ ఇంచార్జ్‌లు, కీలక నేతలు పోటీ చేసే స్థానాలపై వైసీపీ అధినేత ఎప్పుడు డెసిషన్ తీసుకుంటారోనన్నది సస్పెన్స్‌గా మారింది.




## ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వ విద్యార్థి ప్రింటర్ బహుకరణ..

ఏన్కూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు చదువుకున్న కళాశాల స్థితిగతులు ఏవిధంగా ఉంది, అని చూడటానికి వచ్చిన విద్యార్థికి కళాశాలలో ప్రింటర్ లేక ఇబ్బందులకు గురవుతున్నామని ప్రిన్సిపాల్ ద్వారా తెలుసుకున్న పూర్వ విద్యార్థి గంగవరపు రమేష్ ఆన్లైన్లో ప్రింటర్ ఆర్డర్ చేసి పదివేల రూపాయలు విలువగల ప్రింటర్‌ను ఆన్లైన్ ద్వారా అందజేశాడు. దీంతో కళాశాలకువచ్చిన ప్రింటర్‌ను జూనియర్ అసిస్టెంట్ యం.లావణ్య ప్రింటర్ను అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.సింహాచలం కోరిక మేరకు పూర్వ విద్యార్థి రమేష్ తక్షణమే ప్రింటర్ ఆన్లైన్ ద్వారా ఇప్పించడంతో కళాశాల సిబ్బంది,ఆధ్యాపక, ఆధ్యాపకేతర బృందం, పూర్వ విద్యార్థి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత 30 ఏళ్ల క్రితం చదువుకున్న కళాశాలను గుర్తుంచుకొని, తనకు చేతనైనంత రీతిలో స్పందించినందుకు పలువురు అభినందించారు.

# మళ్లీ గుడివాడ రాజకీయాల్లోకి నాని

విజయవాడ, : మాజీ మంత్రి కొడాలి నాని గుడివాడ రాజకీయాల్లోకి మళ్లీ ఎంట్రీ ఇచ్చారు. సుదీర్ఘ విరామం తర్వాత క్రియాశీల రాజకీయ కార్యక్రమంలో ప్రత్యక్షమయ్యారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో ఆయన పాల్గొన్నారు. గతంలో కోర్టు వాయిదాలకు.. ముందస్తు బెయిల్ షరతుల్లో భాగంగా పోలీస్ స్టేషన్లలో సంతకాలు పెట్టడానికి వచ్చి వెళ్లిపోయేవారు. కానీ ఈ సారి రాజకీయ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చారు.మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న కొడాలి నాని, గవర్నర్‌కు అందించే వినతిపత్రంలో సంతకం చేశారు. ఆ తర్వాత, వినతి పత్రాలను జిల్లా కమిటీకి అందించే పార్టీ శ్రేణుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన పార్టీ శ్రేణులతో కొడాలి నాని మాట్లాడారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు వైద్య విద్య అందాలనే మంచి సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు పునాదులు వేశారని కొడాలి నాని తెలిపారు. వైసీపీ పాలనలో ఐదు కళాశాలలు పూర్తి అయ్యాయన్నారు. మరో ఐదు కళాశాలల నిర్మాణం తుది దశకు చేరుకున్నాయని కానీ వాటిని పూర్తి చేయలేదన్నారు. పేద ప్రజలు, విద్యార్థులకు ఉపయోగపడే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, హాస్పిటల్స్ ప్రైవేటీకరణ దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రను అడ్డుకోవాలంటే మాజీ సీఎం జగన్ ప్రజలతో కలిసి పోరాటాన్ని మొదలుపెట్టారని కొడాలి వివరించారు. తమ ఉద్యమానికి ప్రజల నుంచి చక్కటి స్పందన వచ్చిందని కొడాలి నాని ప్రకటించారు. ప్రజల విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాభిష్టానికి అనుకూలంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఉద్యమంలో తమ సేకరించిన వినతి పత్రాలను వైసీపీ అధినేత జగన్ నాయకత్వంలో గవర్నర్‌కు అందజేయనున్నట్లు మాజీ మంత్రి కొడాలి నాని పేర్కొన్నారు. కొడాలి నాని ప్రభుత్వం మారగానే తీవ్ర సమస్యలు ఎదుర్కొంటారని అనుకున్నారు. కానీ ఆయన గుడివాడకు రాకుండా ఉండటంతో పాటు గుండెనొప్పితో ఆస్పత్రిలో చేరి ఆపరేషన్ చేయించుకున్నారు. ముంబైలో ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. దీంతో ఆయన కోలుకోవడానికి సమయం పట్టింది. రెడ్ బుక్ లో మొదటి పేరు కొడాలి నానితే ఉంటుందని టీడీపీ వర్గాలు చెబుతూ ఉంటాయి. ఆయన వైసీపీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల పాటు విపరీతమైన భాషను ఉపయోగించేవారు. ఇప్పుడు ఆయన పూర్తిగా ఆరోగ్యంగా ఉండటంతో..టీడీపీ క్యాడర్ కూడా రెడ్ బుక్ మళ్లీ రెడీ అవుతుందని నమ్ముతున్నారు .

# గ్రేటర్ హైదరాబాద్ ఆఫీసులోనే నీళ్లు ల్లేవ్..?

హైదారాబాద్: హైదరాబాద్‌ను విశ్వనగరంగా మారుస్తాం, ఇంటింటికీ 24 గంటల మంచినీరు ఇస్తాం అని ప్రగల్భాలు పలికే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పెద్దలకు.. సొంత ఆఫీసులో నీటి కష్టాలు తీర్చడం చేతకావడం లేదు. నగర ప్రజల దాహార్తిని తీర్చాల్సిన బల్దియా ప్రధాన కార్యాల యంలోనే గత రెండు రోజులుగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది.ట్యాంక్ బండ్ పక్కన ఠీవిగా కనిపించే ఈ పరిపాలనా భవనంలో బుధవారం మధ్యాహ్నం మొదలైన నీటి సమస్య గురువారం రాత్రి వరకు పరిష్కారం కాకపోవడంతో అధికారులు, సిబ్బంది, సందర్శకులు అల్లాడిపోయారు. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసులో గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఏడవ అంతస్తు వరకు నీటి సరఫరా వ్యవస్థ కుప్పకూలింది. మోటార్లు మొరాయించాయో, పైపులైన్లు పగిలాయో తెలియదు కానీ కార్యాలయంలోని ఏ ఒక్క నల్లాలోనూ చుక్క నీరు రాలేదు. మేయర్ విజయలక్ష్మి, కమిషనర్, అదనపు కమిషనర్లు, విభాగాధిపతులు కొలువుదీరే భవనంలోనే 24 గంటలకు పైగా నీటి సరఫరా నిలి చిపో వడం బల్దియా పనితీరుకు అద్దం పడుతోంది. నీటి సరఫరా లేకపోవడంతోభవనంలోని వాష్‌రూమ్‌లు, టాయిలెట్లు అధ్వానంగా తయారయ్యాయి. నీళ్లు లేక ఫ్లష్‌లు పని చేయక, దుర్వాసన వెదజల్లుతుండటంతో కారిడార్లలో నడవడమే కష్టంగా మారింది. ముఖ్యంగా వందలాదిగా ఉన్న మహిళా ఉద్యోగులు వాష్‌రూమ్‌లకు వెళ్లలేక, బయటకు చెప్పుకోలేక నరకం అనుభవించారు.

అత్యవసర పరిస్థితు ల్లో పక్కనే ఉన్న వేరే భవనాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.నగర నలుమూలల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం, జనన మరణ ధృవీకరణ పత్రాల కోసం, టౌన్ ప్లానింగ్ పనుల కోసం హెడ్ ఆఫీసుకు వచ్చే సామాన్య జనం పరిస్థితి మరీ దారుణంగా ఉంది.దాహం వేస్తే మంచి నీళ్లు దొరక్క, టాయిలెట్లకు వెళ్లే దారిలేక వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఊరం దరికీ నీళ్లు పోస్తున్నామంటారు.. ఇక్కడేమో గొంతు తడుపుకోవడానికి కూడా దిక్కులేదు అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.సాధార ణంగా నగరంలో ఎక్కడ నీటి సమస్య వచ్చినా వాటర్ ట్యాంకర్లు పంపించే జీహెచ్ఎంసీ..

తన సొంత ఆఫీసులో నీళ్లు లేకపోతే ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేయడంలో ఘోరంగా విఫలమైంది. బిల్డింగ్ మెయి ంటెనెన్స్ విభాగం అధికారులు నిమ్మకు నీరెత్తిన ట్లు వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు మండిపడుతున్నారు. సమస్య మొదలై 30 గంటలు దాటుతున్నా కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని నింపే ప్రయత్నం చేయలేదని ఆరోపిస్తున్నారు.

నీటి కొరత కారణంగా ఉద్యోగులు పడ్డ పాట్లు అన్నీ ఇన్నీ కావు. బుధవారం, గురువారం మధ్యాహ్న సమయాల్లో లంచ్ చేద్దామంటే కనీసం చేతులు కడుక్కోవడానికి, ప్లేట్లు శుభ్రం చేసుకోవడానికి కూడా నీళ్లు లేని దుస్థితి నెలకొంది. చాలామంది సిబ్బంది తెచ్చుకున్న లంచ్ బాక్సు లను అలాగే వెనక్కి తీసుకెళ్లారు.

మరికొందరు ఆకలికి తట్టుకోలేక క్యాంటీన్లలో కొనుక్కున్న వాటర్ బాటిళ్ల నీటితో చేతులు కడుక్కుని భోజనం కానిచ్చారు. చిన్న చిన్న అవసరాలకు కూడా బయట నుంచి నీళ్లు కొనుక్కోవాల్సి రావడంతో సిబ్బంది తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

# వివాదంలో దువ్వాడ శ్రీనివాస్ జంట?



హైదరాబాద్: లుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి జంట మరోసారి వార్తల్లోకి ఎక్కారు. అనుమతి లేకుండా మద్యం, హుక్కా పరికరాలతో పార్టీ చేసుకుంటున్నారనే సమాచారంతో ఈ ఆకస్మిక తనిఖీ జరిగిందని తెలుస్తోంది. ఈ ఘటనతో వీరిద్దరూ పోలీసుల అదుపులోకి వెళ్లినట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి జంట గురించి తెలియని వారుండరు. ఇక తాజాగా దివ్వెల మాధురి బిగ్‌బాస్ షోలో పాల్గొని,తన పాపులారి టీని మరింత పెంచు కుంది. ఈ లవ్‌బర్డ్స్ గురించి నిత్యం ఏదో వార్త వస్తూనే ఉంటుంది. ఈక్రమ ంలో తాజాగా దువ్వాడ శ్రీనివాస్,మాధురిలు వివాదంలో చిక్కుకున్నా రు. ఈ జంటను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మాధురి బర్త్‌డే సందర్భంగా మొయినాబాద్‌లోని ది పెండెంట్ ఫా మ్‌హౌస్‌లో పార్టీ నిర్వహించి... అనుమతి లేకుండా మద్యం తీసుకు ంటున్నారనే సమాచారంతో.. ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి, వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.డిసెంబర్ 12న దివ్వెల మాధురి పుట్టిన రోజు సందర్భం గా మొయినాబాద్‌లోని ది పెండెంట్ ఫామ్‌హౌస్‌లో దువ్వాడ శ్రీనివాస్ రాత్రి పార్టీ నిర్వహించారని తెలుస్తో ంది. అయితే ఈ పార్టీకి ఎలాంటి అనుమతి లేదని సమాచారం. అలానే పార్టీలో మద్యం తో పాటు మత్తు పదార్థాలు కూడా ఉన్నాయని వార్తలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పార్టీ గురించి స్థానిక పోలీసులకు, ఎస్ఓటీ పోలీసులకు అందిన పక్కా సమాచారంతో ఫామ్‌హౌస్‌పై సంయుక్తంగా దాడి చేసి బర్త్‌డే పార్టీని భగ్నం చేశారు. ఎలాంటి అనుమతి లేని 10 విదేశీ మద్యం బాటిళ్లు, ఏడు హుక్కా పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలుస్తోంది. ప్రస్తు తం పోలీసులు దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురిలను అదుపు లోకి తీసుకున్నట్లు సమాచారం. 2024 లో ఆయన తన కుటుంబా న్ని విడిచిపెట్టి దివ్వెల మాధురితోకలిసి ఉంటున్నారు. టెక్కలిలోని దువ్వాడ నివాసం ముందు ఆయన భార్యాపిల్లలు ధర్నా చేయడంతో ఈ జంటవ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇకఅప్పటి నుంచి వీరిద్దరూ ఓపెన్‌గా తమ బంధం గురించి మాట్లాడుతున్నారు. బయట ఫంక్షన్లు, కార్యక్రమాలకు జంటగా కలిసే వెళ్తున్నారు.ఇదిలా ఉంటే.. బిగ్‌బాస్ 9 తెలుగుకి దివ్వెల మాధురి వైల్డ్‌కార్డ్ ఎంట్రీగా వెళ్లింది. ముచ్చటగా మూడు వారాల పాటు హౌస్‌లో ఉంది దివ్వెల మాధురి. మొదటి వారం ఆమెని ఎవరూ నామినేట్ చేయలేదు. ఇక రెండో వారం తనే తనూజతో డైరెక్ట్ నామినేషన్ చేయించుకొని, బిగ్‌బాస్ హౌస్ నుంచి ఎలిమినేట్ అయి బయటికొచ్చేసింది. శివాజీకి ఇచ్చిన ఇంటర్వ్యూ,మరో యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూ తెగ వైరల్ అయ్యాయి.

# రుణమాఫీతోనే తెలంగాణలోనే అప్పుల తక్కువ

హైదారాబాద్: ఏపీ,తమిళనాడు, కర్ణాటకలతో పోలిస్తే తెలంగాణ రైతులకు తక్కువగా అప్పులు ఉన్నాయని కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించింది. 2025 డిసెంబరు నాటికి తెలంగాణ రైతుల అప్పు రూ.1.75 లక్షల కోట్లుగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన రూ.2 లక్షల రుణమాఫీ వల్లే ఈ లబ్ధి చేకూరిందని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. మరోవైపు, బహిరంగ మార్కెట్ రుణాల సేకరణలో తెలంగాణ రూ.69,300 కోట్లతో దేశంలోనే మూడో స్థానంలోనిలిచింది.ఏపీ, తమిళనాడు, కర్ణాటకలతో పోలిస్తే.. తెలంగాణలో రైతులకు రుణభారం తక్కువగా ఉందట. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి పార్లమెం ట్‌లో వెల్లడించారు. వివిధ రాష్ట్రాల్లో రైతులకు ఉన్న అప్పుల మొత్తంపై తమిళనాడు ఎంపీ ఎ.రాజా లోక్‌సభలో ప్రశ్న అడిగారు. ఆ ప్రశ్నకు ఆర్థికశాఖసహాయ మంత్రి పంకజ్ చౌధరి మం గళవారం లిఖితపూర్వక సమాధానమిచ్చారు.2025 డిసెంబరు 31 నాటికి తమిళనాడు అన్నదాతలపై రూ.5,0 6,290.45 కోట్లు, ఏపీ రైతులపై రూ.3,7 5,254.59 కోట్లు,కర్ణా టక రైతులపై రూ.2,10,244.47 కోట్ల అప్పుల భారం ఉందని వెల్లడించారు. ఇదే సమయంలో తెలంగాణ అన్నదాతలపై మాత్రం రూ.1,75,960.56 కోట్ల అప్పు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. ఇక బహిరంగ మార్కెట్ నుంచి రుణాల సేకరణలోతెలంగాణ ప్రభుత్వం మూడో స్థానంలో నిలిచిందని కేంద్రంస్పష్టం చేసింది. 2025-26ఆర్థిక సంవత్సరం తొలి మూడు త్రైమాసి కాల్లో తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.69,300 కోట్ల అప్పు చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి వెల్లడించారు. రాష్ట్రాల రుణాలపై రాజ్యసభలో వైసీపీ సభ్యుడు గొల్ల బాబురావు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు.మహారాష్ట్ర రూ.99 వేలకోట్లు, తమిళనాడు రూ.95 వేల కోట్లు తర్వాత మార్కెట్ నుంచి అత్యధిక మొత్తం రుణాలు సేకరించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని అన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో రాజస్థాన్ రూ.60 వేల కోట్లు, ఆంధ్రప్రదేశ్ రూ.56 వేల కోట్లు రుణాలుసేకరించినట్లు తెలిపారు.తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో పలు విడతల్లో రుణామాఫీ చేసింది. దాదాపు 25 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరేలా రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేశారు. అందుకు రూ.21 వేల కోట్లకుపైగా నిధులు విడుదల చేశారు. ఈ కారణంతోనే దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ రైతులకు తక్కువ అప్పులున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని అంటున్నారు. అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెబుతున్నారు.




# రజనీకాంత్ బయోపిక్ రెడీ..



కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్ అంటే ఉండే క్రేజ్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పని లేదు. ఆయన వాకింగ్ స్టైల్, డ్యాన్స్‌కే కోట్లాది మంది అభిమానులు ఫిదా అయ్యారు. బస్ కండక్టర్ స్థాయి నుంచి స్టార్‌గా ఎదిగిన ఆయన ప్రయాణం ఇండస్ట్రీలో ఎందరికో స్ఫూర్తి. ఆయన బయోపిక్ సిల్వర్ స్క్రీన్‌పై రానుందంటూ ఎప్పటి నుంచో ప్రచారం సాగుతోంది. తాజాగా దీనిపై ఆయన కుమార్తె ఐశ్వర్య ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.రజనీ కాంత్ బయోపిక్‌పై తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఐశ్వర్య ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ చెప్పారు. తన తండ్రి ఆటో బయోగ్రఫీ వర్క్ ఇప్పటికే ప్రారంభం అయినట్లు తెలిపారు. ఇది రిలీజ్ అయ్యాక వరల్డ్ వైడ్‌గా ఓ సెన్సేషన్ అవుతుందని అన్నారు. దీంతో అభిమానుల్లో ఓ కొత్త ఉత్సాహం నెలకొంది. అయితే, ఈ బయోపిక్‌లో ఎవరెవరు నటిస్తున్నారు? ఎవరు డైరెక్ట్ చేయబోతున్నారు? అనే వివరాలు తెలియాల్సి ఉంది. త్వరలోనే దీనిపై క్లారిటీ వచ్చే ఛాన్స్ ఉంది. ఇండస్ట్రీలో ంఎ వినియోగం మంచిదే అయినా అది ఎప్పటికైనా కృత్రిమమే అనేది గుర్తించుకోవాలన్నారు ఐశ్వర్య. అధునాతన టెక్నాలజీ సాయంతో 'కోచ్చాడయాన్ (2014)' వంటి విజువల్ వండర్ తెరకెక్కించగలిగామని చెప్పారు. వీలైతే భవిష్యత్తులో అలాంటి మూవీస్ తీయడం తనకు ఇష్టమని అన్నారు.

'3', 'లాల్ సలామ్' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన ఐశ్వర్య... 'విత్ లవ్' అనే మూవీకి నిర్మాతగా వ్యవహరించారు.ఈ మూవీలో 'టూరిస్ట్ ఫ్యామిలీ' డైరెక్టర్ అభిషన్ జీవింత్ హీరోగా నటించగా... మదన్ దర్శకత్వం వహించారు. 'ఛాంపియన్' ఫేం అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించారు. ఫిబ్రవరి 6న సినిమా తెలుగులోనూ రిలీజ్ కానుంది. అటు, రజనీకాంత్ ప్రస్తుతం 'జైలర్ 2'తో బిజీగా ఉండగా జూన్ 12న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌ను సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది.

# తమన్నా, పూజా హెగ్డే. మధ్య పోటీ!



కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎంతో మంది హీరోయిన్లు ఉన్నారు, వాళ్ళని బ్రాండ్ అంబాసిడర్ గా ఎంచుకోవచ్చు కదా, ఎందుకు తమన్నా ని ప్రత్యేకించి తీసుకున్నారు. కర్ణాటక లో పుట్టిన పెరిగిన పూజా హెగ్డే ని ఎందుకు ఎంచుకోలేదు?, ఆమెతో పాటు రష్మిక మందాన,రుక్మిణి వాసంత్, శ్రీనిధి శెట్టి వంటి పాన్ ఇండియన్ స్టార్ హీరోయిన్లందరూ కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారే. క్రేజ్, ఫాలోయింగ్, ఫేమ్ విషయంలో వీళ్ళు తమన్నా కి ఏ మాత్రం తీసిపోరు. అయినప్పటికీ వీళ్ళలో ఎవరో ఒకరిని ప్రభుత్వం ఎందుకు ఎంచుకోలేదు అంటూ నిలదీస్తున్నారు. ప్రతి పక్ష పార్టీ కి చెందిన నేతలు.బీజేపీ పార్టీ నాయకులూ కూడా ఈ విషయం లో ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో తప్పుబడుతున్నారు. స్థానిక తారలను విస్మరించడం స్థానిక కాంగ్రెస్ నేత కన్నడ వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శమని అంటున్నారు. అలా తమన్నా, పూజా హెగ్డే , రష్మిక వంటి హీరోయిన్ల పేర్లు రాజకీయాలకు ఏ మాత్రం సంబంధం లేకపోయినా అక్కడి నేతలు తీస్తున్నారు. అయితే కర్ణాటక ప్రభుత్వం మాత్రం ఈ విమర్శలను లెక్క చేయడం లేదు, వాళ్లకు చేయాలనుకున్న పనులు చేస్తూ ముందుకెళ్తున్నారు.




సినీ రంగం లో తమన్నా, పూజ హెగ్డే లకు ఉన్న క్రేజ్ ఎలాంటిదో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రతీ ఏటా ఎంతో మంది యంగ్ హీరోయిన్లు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టొచ్చు, కానీ వీళ్లిద్దరి క్రేజ్ మాత్రం ఇసుమంత కూడా తగ్గలేదు. హిట్, ఫ్లాప్ లతో సంబంధం లేకుండా,వరుసగా సినిమాలు చేస్తూ దూసుకెళ్తున్నారు ఈ ఇద్దరు హీరోయిన్స్. అయితే వీళ్లకు ఏ మాత్రం సంబంధం లేని రాజకీయాలు, ఇప్పుడు వీళ్లిద్దరు చుట్టూ తిరుగుతున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యం లో ఉండే మైసూర్ శాండిల్ సోప్‌కి బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించేందుకు తమన్నాని ఎంపిక చేశారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా మైసూర్ శాండిల్ సోప్స్ కి ఉన్న క్రేజ్ మామూలుది కాదు. ఈమధ్య కొత్త ప్రొడక్ట్స్‌కారణంగా ఈ బ్రాండ్ కి కాస్త క్రేజ్ తగ్గింది.అందుకే ప్రభుత్వం ఈసోప్‌ను రీ బ్రాండింగ్ చేస్తూ, నేడు లాంచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. అయితే ఈ బ్రాండ్ కి తమన్నా ని ఎంపిక చేయడం పై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి.

# 'ఫౌజీ'తో యాక్షన్‌కు రెడీ..



రెబల్ స్టార్ కృష్ణంరాజు నట వారసుడిగా సినీ పరిశ్రమలో అడుగుపెట్టి, ప్రస్తుతం భారతదేశంలోనే అతిపెద్ద సూపర్‌స్టార్లలో ఒకరిగా ఎదిగారు ప్రభాస్.ఇప్పుడు వరుస పాన్ ఇండియా చిత్రాలతో అభిమానుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. భారీ బడ్జెట్ సినిమాలు, దేశవ్యాప్త విడుదలలు, అంతర్జాతీయ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకున్న కథలతో ఆయన రేంజ్ మరింత పెరుగుతోంది. సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా వందల కోట్ల వసూళ్లు సాధించడం ప్రభాస్ ప్రత్యేకతగా ట్రేడ్ వర్గాలు చెబుతుంటాయి. ఇలాంటి సమయంలో ఆయన నటిస్తున్న తాజా చిత్రం ఫౌజీ షూటింగ్‌లో స్వల్ప ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. గుర్రపు స్వారీ సన్నివేశం చిత్రీకరణ సమయంలో ప్రభాస్ కింద పడిపోవడంతో చేతులకు చిన్న గాయాలు అయినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. చిత్రబృందం వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందించగా, గాయాలు తీవ్రంగా లేవని తెలిసింది. వైద్యులు ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం ప్రభాస్ సురక్షితంగానే ఉన్నారని, త్వరలోనే మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నారని యూనిట్ తెలిపింది. ఈ వార్తతో అభిమానులు తొలుత ఆందోళన చెందగా, గాయాలు చిన్నవేనని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. 'ఫౌజీ' చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో సీతారామంతో ప్రశంసలు అందుకున్న ఆయన, ఈసారి మరింత ఎమోషన్‌తో కూడిన యాక్షన్ డ్రామాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని టాక్. ఈ సినిమాలో ప్రభాస్ బ్రిటిష్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారని సమాచారం. దేశభక్తి, ప్రేమ, త్యాగం వంటి అంశాలతో కథ నడుస్తుందని తెలుస్తోంది. గుర్రపు స్వారీతో కూడిన హై వోల్టేజ్ చేజింగ్ సన్నివేశం సినిమాకే హైలైట్‌గా నిలవనుందని, భారీ సెట్స్ మరియు విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సన్నివేశాలను రూపొందిస్తున్నారని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇదిలా ఉండగా ప్రభాస్ తదుపరి చిత్రం స్పిరిట్‌పై కూడా భారీ అంచనాలే ఉన్నాయి. ఈ చిత్రానికి సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తుండగా, పోలీస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రీ నటిస్తుండగా, టి–సిరీస్ నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదల తేదీని ప్రకటించగా, ఈ చిత్రం వచ్చే ఏడాదిమార్చి 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల ది రాజా సాబ్‌తో ఆశించిన ఫలితంఅందుకోలేకపోయిన ప్రభాస్‌చేతిలో ప్రస్తు తం ఫౌజీ, స్పిరిట్‌తో పాటు సలార్ 2, కల్కి 2 వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ వరుస చిత్రాలతో ప్రభాస్ రేంజ్ మరింత పెరగడం ఖాయమనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# టాక్సిక్ కోసం యష్ క్రేజీ మేకోవర్..



పాన్ ఇండియా స్టార్, అందులోనూ రాకింగ్ స్టార్ యష్ అనగానే.. ఆ పొడవాటి జుట్టు, గుబురు గడ్డం, ఊరమాస్ లుక్ టక్కున కళ్లముందు మెదులుతాయి. కేజీఎఫ్ సిరీస్ నుంచి దాదాపు ఎన్నో ఏళ్లుగా అదే లుక్ మైంటైన్ చేసిన యష్.. ఎట్టకేలకు ఆ ఐకానిక్ స్టైల్‌కి ఎండ్ కార్డ్ వేశాడు. గీతూ మోహన్‌దాస్ డైరెక్షన్‌లో వస్తున్న తన అప్‌కమింగ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్–అప్స్' కోసం పూర్తిగా మేకోవర్ అయ్యాడు. జుట్టు, గడ్డం ట్రిమ్ చేయించుకుంటూ న్యూ లుక్‌లోకి మారుతున్న ఓ మేకింగ్ వీడియోను తాజాగా రిలీజ్ చేయగా.. ఇప్పుడది సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. అందులో తన భార్య రాధికా పండిట్ యష్ గడ్డాన్ని పట్టుకుని.. "ఫైనల్లీ.. ఈ గడ్డానికి, జుట్టుకి విముక్తి దొరికింది" అంటూ ఎమోషనల్ అవ్వడం ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. యష్ క్లీన్ షేవ్ లుక్ బయటకు రావడంతో.. ఈ సినిమాలో అతడు డబుల్ రోల్ చేస్తున్నాడనే ప్రచారానికి ఆజ్యం పోసినట్టైంది. రీసెంట్‌గా ఫిబ్రవరి 21న విడుదలైన పోస్టర్‌లో యష్ 'టికెట్' అనే కుర్రాడి పాత్రలో కనిపించాడు. ఈ మేకోవర్ వీడియో ఆ క్యారెక్టర్ కోసమే. అంతకుముందు జనవరి 8న తన బర్త్‌డే రోజున 'రాయ' అనే మరో లుక్‌ను రిలీజ్ చేశాడు. దీంతో సినిమాలో యష్ రెండు డిఫరెంట్ రోల్స్ ప్లే చేస్తున్నట్లు దాదాపు క్లారిటీ వచ్చేసింది. ఇదంతా ఒకెత్తయితే.. టీజర్‌లో కొన్ని సెకన్ల పాటు కనిపించిన ఓ మిస్టరీ 'జోకర్' క్యారెక్టర్ మరో ఎత్తు. ఆ క్లౌన్ మేకప్‌లో ఉన్నది యష్ మూడో అవతారమా? లేక కథను మలుపుతిప్పే ఏదైనా సింబాలిక్ క్యారెక్టరా? అంటూ ఫ్యాన్స్ బాగా చర్చించుకుంటున్నారు. సినిమా రిలీజ్ అయ్యేలోపు ఈ పజిల్‌ను సాల్వ్ చేసే పనిలో పడ్డారు నెటిజన్లు.ఈ పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాలో భారీ తారాగణమే ఉంది. రుక్మిణి వసంత్ (మెలిస్సా), నయనతార (గంగ), కియారా అద్వానీ (నాడియా), హుమా ఖురేషీ (ఎలిజబెత్), తారా సుతారియా (రెబెక్కా) లాంటి స్టార్స్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, యశ్ హోమ్ బ్యానర్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఒకేసారి షూట్ చేయడం విశేషం. రాజీవ్ రవి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. రవి బస్రూర్, విశాల్ మిశ్రా, తనిష్క్ బాగ్చీ మ్యూజిక్ ఇస్తున్నారు. ఉజ్వల్ కులకర్ణి ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. ముఖ్యంగా హాలీవుడ్ స్టంట్ మాస్టర్ జేజే పెర్రీ యాక్షన్ సీక్వెన్స్ డిజైన్ చేయడం సినిమాపై క్యూరియాసిటీని పెంచుతోంది.

# బాలీవుడ్ వర్సెస్ టాలీవుడ్




హైదరాబాద్,: సినిమా ఇండస్ట్రీలో సక్సెస్ లను సాధించిన హీరోకి క్రేజ్ భారీ రేంజ్ లో మార్కెట్ ఉంటుంది. వాళ్ల నుంచి వచ్చిన సినిమాలను ప్రేక్షకులు అలరించడమే కాకుండా వాళ్ళు కనిపిస్తే చాలు వాళ్ళతో ఫోటోలు దిగడానికి కూడా ఎగబడిపోతుంటారు. ఇక ఇలాంటి క్రమంలోనే మన హీరోలు గత 10 సంవత్సరాల క్రితం వరకు తెలుగు సినిమాలకే పరిమితమయ్యారు. కానీ ఎప్పుడైతే బాహుబలి సినిమా వచ్చిందో అప్పటినుంచి పాన్ ఇండియా స్థాయిలో మన హీరోలు సినిమాలను చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు? ఇక ఇప్పటివరకు మన హీరోలు టాప్ లో ఉండాలనే ఆలోచిస్తున్నారు. కానీ బాలీవుడ్ హీరో అయిన రణ్వీర్ సింగ్ దూరంధర్ సినిమాతో సైతం 1000 కోట్ల మార్కెట్ ను దాటేశాడు. కాబట్టి బాలీవుడ్ హీరోలు మరోసారి ఊపందుకునే ప్రయత్నంలో ఉన్నారు. అలాంటి సందర్భంలో వారిని తక్కువ అంచనా వేసి చూడకూడదు.మన ప్రయత్నంలో మనం ఉండాలి అలాగే వాళ్ళ కంటే బెటర్ సినిమాలను చేసి సూపర్ హిట్లను సాధించడానికి తీవ్రమైన కృషి చేయాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన కూడా మళ్లీ మన హీరోలు బీట్ చేసి వాళ్ళ ముందుకు దూసుకెళ్లే ప్రమాదం కూడా ఉంది?కాబట్టి ప్రతి విషయంలో మన వాళ్ళు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తే మంచిదని మరి కొంతమంది సినిమా మేధావులు సైతం మన హీరోలను, దర్శకులను హెచ్చరిస్తున్నారు.ఇక ఇలాంటి క్రమంలోనే వీళ్ళు ఎలాంటి సక్సెస్ ను సాధిస్తారు. తద్వారా వీళ్ళకంటూ ఒక ఐడెంటిటి క్రియేట్ అవుతుందా? లేదా అనేది తెలియాలంటే మాత్రం మరికొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే? ఖాన్ త్రయం పని అయిపోయినప్పటికి నెక్స్ట్ జనరేషన్ బాలీవుడ్ హీరోలందరు కూడా మంచి కాన్సెప్ట్ లను ఎంచుకొని సినిమాలు చేస్తున్నారు.కాబట్టి మన హీరోలు సైతం చాలా చాకచక్యంగా వ్యవహరిస్తూ కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలను చేస్తూ తెలుగు ఇండస్ట్రీ స్థాయిని పెంచాల్సిన పరిస్థితి అయితే ఏర్పడింది? ఇక ఏది ఏమైనా కూడా ఇండియాలో ఇప్పుడున్న స్టార్ డైరెక్టర్లందరు మన హీరోల వైపే మొగ్గుచూపుతున్నారు. మన వాళ్ళతో సినిమాలను చేస్తే వాళ్లకు కూడా గొప్ప పేరు వస్తుందని ఆలోచిస్తున్నారు

Published & Owned by Mamidi Somaiah, H.No.3-12-92/271 to 276/506, Rock Town Colony, LB Nagar, Hyd, Rangareddy, Telangana 500068. Printed at Ellora Printers, LN Nagar, Industrial Estate, Uppal, Rangareddy, Telangana. Editor Mamidi Somaiah. Ph No. 9100933723. RNI No. TEL TEL : 2012/48343